ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు
జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	44.1	44.0	44.0	43.0	45.0
కనిష్ఠం	32.5	31.0	32.0	21.0	31.0

భక్తి, శక్తి కలిస్తే భజరంగభళి!!

నేడు హనుమజ్జయంతి



అచంచలమైన భక్తివిశ్వాసాలకు, అమేయమైన శక్తి సామర్థ్యాలకు ప్రతీక హనుమంతుడు. రామబంటుగా స్వామి భక్తిని చాటి, సీతాన్వేషణలో.. సంజీవిని సాధనలో శక్తియుక్తులను ప్రదర్శించి సేవకు ప్రతిరూపంగా కీర్తిగడించాడు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణతోపాటు అన్ని భయాలను పోగొట్టే అభయ మూర్తిగా ఆంజనేయుడు భక్తుల పూజలందుకుంటున్నాడు.

నెల్లూరు (సాంస్కృతికం), మే 31 : భజరంగభళి పుట్టినరోజును హనుమజ్జయంతి పర్వదినంగా ప్రజలు జరుపుకుంటారు. శనివారం ఈ పండుగ సందర్భంగా జిల్లాలోని అన్ని రామాలయాలు, కృష్ణమందిరాలు ఆంజనేయస్వామి ఆలయాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. కొన్ని ఆలయాల్లో ఇప్పటికే ఉత్సవాలు జరుగుతున్నాయి. హనుమంతుని ఆరాధనతో ధైర్యం, స్థైర్యం కలుగుతాయని, భయాలు, భ్రమలు తొలగి, తలపెట్టిన కార్యంలో విజయం సిద్ధిస్తుందని పండితుల ఉవాచ. ఈ నేపథ్యం లో హనుమజ్జయంతి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు, హోమాలు, అన్నదానాలు, పల్లకీసేవలు, సీతారాముల కల్యాణాలు జరగనున్నాయి.



పురుషామృగ వాహనంపై ఆదిదంపతులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 31 : మల్లికార్జున, కామాక్షితాయి కొలువైన జొన్నవాడ క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి పురుషామృగ వాహనంపై కొలువైన ఆదిదంపతులు భక్తులను కటాక్షిస్తూ ఊరేగారు. ఉదయం తిరుచా ఉత్సవంపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం ఉత్సవర్ల దర్శనానంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ ఉత్సవాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయి సింహవాహనంపై దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

- కళాశాలల పునఃప్రారంభం

నెల్లూరు (విద్య), మే 31 : ఇంటర్మీడియట్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ప్రథమ సంవత్సరంలో నూతన ప్రవేశాలతోపాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు. గడిచిన విద్యా సంవత్సరం కంటే కొత్త సంవత్సరానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల కంటే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లోనే మంచి ఫలితాలు వస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా ప్రైవేట్ వైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు అధికారులు పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించి నెల రోజులుగా విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు జరుపుతున్నారు. జిల్లాలో 218 జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో 23 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ కళాశాలలు కలవు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మొత్తం 7,500 సీట్లు అందుబాటులో ఉండగా గతేడాది 5,700 మంది విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులతోపాటు వృత్తివిద్యాకోర్సుల్లో సీట్లు పొందారు. ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

- **పుస్తకాలు లేకుండానే..**

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాలుగేళ్లుగా పాఠ్యపుస్తకాలు లేకుండానే విద్యాబోధన సాగుతుండటం గమనార్హం. అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందిన, పేద విద్యార్థులే ఈ కళాశాలల్లో చదువుతుండగా వీరికి పాఠ్యపుస్తకాలు అందించకపోవడమేకాక మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా తొలగించడంతో ఆయా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత పుస్తకాలు, లైబ్రరీలలో దొరికే వాటితో సాధన చేసి పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో నూతన విద్యా సంవత్సరంలో అయినా అధికారులు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే నాడు-నేడు పేరుతో అత్యధిక కళాశాలల్లో చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అదనపు తరగతి గదులు పూర్తి కాకపోవడం, పూర్తయిన వాటిని సంబంధిత కళాశాలలు వాటి కార్యాలయాలకు వినియోగించుకోవడంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో, వరండాల్లో కూర్చోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు కళాశాలలు తొలిరోజు సమస్యలతోనే స్వాగతం పలకనున్నాయి.

నేటి నుంచి పింఛన్లు, రేషన్ పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), మే 31 : సామాజిక పింఛన్ల పంపిణీ, రేషన్ సరుకుల పంపిణీ శని వారం నుంచి జరుగనుంది. పింఛన్లను 5వ తేదీ వరకు బ్యాంకుల ద్వారా చెల్లించనున్నారు. జిల్లాలో 3,14,422 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయనున్నారు. వీరిలో 2,28,471 మంది లబ్ధిదారు లకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుండగా, బ్యాంకు అకౌంట్‌లేని 85,951 మంది లబ్ధిదారులకు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటి వద్దనే అందజేస్తారు. ఇక, రేషన్ సరుకుల విషయానికి వస్తే శనివారం నుంచి 17వ తేదీ వరకు చేపడుతున్నామని డీఎస్వో డీవీ రమణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 7,33,520 కార్డుదారులకు బియ్యం, చక్కెర పంపిణీ చేస్తారని తెలిపారు. ఇందుకోసం 9వేల టన్నుల బియ్యం, కార్డుకు అరకేజీ వంతున చక్కెర కేటా యింపు జరిగిందన్నారు. సరుకులు చౌకదుకాణాలకు చేరాయని, ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారు లకు అందచేసేందుకు చర్యలు తీసుకున్నామని డీఎస్వో తెలిపారు.

కిలో పొగాకు రూ.331

కలిగిరి, మే 31 : పొగాకు ధర పెరుగుతుండటంతో సాగుదా రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కలిగిరి వేలం కేంద్రానికి శుక్ర వారం 742 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 15 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 606 బేళ్ల కొనుగోలు చేశారు. నోబిడ్-95, ఆర్ఆర్-2, సీఆర్-22, జంపింగ్ లాట్స్-17 కారణాలతో 136 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.331, కనిష్ఠ ధర రూ.205, సగటు ధర రూ.289.04గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

మందు మోసేద్దాం!

ఎన్నికల కౌంటింగ్‌కు ముందే మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు మూసి వేస్తారన్న ప్రచారంతో పలు పార్టీల రాజకీయ నాయకులు మద్యం నిల్వపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఎన్నికల పోలింగ్ తర్వాత పోలీసుల నిఘా ప్రత్యేక చెక్‌పోస్టులపై తగ్గడం, వాహనాల తనిఖీలు పెద్దగా జరగక పోవడంతో ఇదే అదునుగా ఇతర రాష్ట్రాల నుంచి సరుకు తరలిస్తున్నట్లు తెలిసింది. పోలింగ్‌కు ముందు జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మరోసారి జిల్లా వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం డంప్‌లు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- మద్యం నిల్వలపై నాయకుల దృష్టి
- మూడురోజులు లిక్కర్ బంద్ అంటూ ప్రచారం
- కౌంటింగ్ రోజు కోసం ముందుగానే స్టాక్
- 'బెల్టు' వ్యాపారుల హడావిడి
- ప్రభుత్వ దుకాణాల నుంచి తరలుతున్న కేసులు
- మద్యం షాపులు రాత్రి 8 వరకే..!

నెల్లూరు(క్రైం), మే 31: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. గతంలో పోలింగ్ ముగిస్తే ఎన్నికల ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లే భావించేవారు. అయితే ఈసారి పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చోటుచేసుకున్న అల్లర్లు, ఘర్షణలతో కౌంటింగ్ ప్రక్రియపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేలా పది రోజులుగా ముందస్తు చర్యలు చేపడుతు న్నారు. మరో మూడు రోజుల్లో కౌంటింగ్ జరగనుండ టంతో రాజకీయ నాయకులు, అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమాగా ఉంటూ సంబరాలకు సిద్ధపడుతున్నారు. మద్యం నిల్వలపై దృష్టి సారిస్తున్నారు. భారీగా మద్యం తరలించేం దుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మద్యానికి డిమాండ్ పెరిగింది. ఇదిలా ఉండ గా ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడు రోజులు మద్యం దుకాణాలు, బార్లు మూసేస్తారంటూ సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు ఆ మూడు రోజులకు సరిపడా మందును స్టాక్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తం మీద కౌంటింగ్ రోజు కోసం మద్యాన్ని భారీగా డంప్ చేసే పనిలో అందరూ నిమగ్నమై ఉన్నారు. మరోవైపు ప్రభుత్వం మద్యం దుకాణాల పని వేళలను ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు కుదించారు. గతంలో కంటే గంట ముందే దుకాణాలు మూసేస్తున్నారు. బార్లకు మాత్రం ఎలాంటి నిబంధనలు విధించక పోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



నిఘా కరువు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, మాల్‌ల నుంచి నాయకుల చేతికి మద్యం అందిందని పోలీసులు నిర్ధారించారు. ఈ క్రమంలో పలువురిని అరెస్ట్ చేయడంతోపాటు, మద్యం దుకాణాల్లో విధులు నిర్వహించే వారిని విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అయితే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వ మద్యం దుకాణాలపై మాత్రం నిఘా కన్పించడం లేదనే విమర్శలున్నాయి.

ఎక్సైజ్ అధికారులు మద్యం సేల్స్ వరకే మా పరిధి, మిగిలింది అంతా సెబ్ వాళ్ల పనే అంటున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి ఇప్పటికే బెల్ట్ వ్యాపారుల చేతికి, స్థానిక రాజకీయ నాయకులకు అధిక సంఖ్యలో మద్యం కేసులు చేరినట్లు సమాచారం. ఇక ఎన్నికల్లో గెలిచే పార్టీని బట్టి బార్ల యాజమాన్యం 4వ తేదీ మధ్యాహ్నం తర్వాత మద్యం అందిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. మరి సీల్ వేసిన బార్ల నుంచి తీసి ఇవ్వడం కుదరదు కాబట్టి ముందుగానే బార్ల యాజమాన్యం స్టాక్‌ను నిల్వ ఉంచుతారని అంచనా.

కన్నెత్తి చూడని సెబ్

ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి జిల్లాలో సెబ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. పోలింగ్‌కు ముందు తనిఖీల్లో పదుల సంఖ్యలో బెల్ట్ దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు తప్ప డంప్‌ల జోలికి వెళ్లలేదన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎన్నికల అధికారులకు అందిన ఫిర్యాదులతో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో మద్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత విచారణ చేపట్టిన సెబ్ అధికారులు అసలు నేరస్థులు ఎవరన్నది బయట పెట్టకుండా కొందరిని అరెస్ట్ చేసి చేతులు దులుపుకు న్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాష్ట్రంలో అల్లర్లు చెలరేగుతున్న సమయంలోనూ జిల్లాలో మద్యం డంప్ పై సెబ్ అధికారులు పెద్దగా దృష్టిగా సారిం చలేదని, అన్నీ మేమే చేయాలా?.. వారెందుకు ఇంక? అంటూ పోలీసు శాఖలో అధికారులు చర్చించుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో కౌంటింగ్ లోపు జిల్లాలో ఇంకెన్ని మద్యం డంప్‌లు బయటకు వస్తాయో చూడాలి.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం, మే 31: సోమశిల జలాశయం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. శుక్రవారానికి 7.415 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువ లకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. కాగా, డ్యాంలో నీటిమట్టం పడిపోతుండటంతో అన్నదాతలో ఆందోళన నెలకొంది.

రట్టవుతున్న పసిడి గుట్టు!

- పోలీసుల తనిఖీల్లో అక్రమ వ్యాపారం వెలుగులోకి
- బంగారు బిస్కెట్లు రవాణా చేస్తూ పట్టుబడుతున్న వైనం
- రెండు రోజుల్లోనే ఏడున్నర కిలోల స్వర్ణం స్వాధీనం



వెంకటాచలం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు

కావలి/వెంకటాచలం, మే 31 : దొడ్డిదారిన జరుగుతున్న పసిడి వ్యాపారం గుట్టు రట్టవుతోంది. చెన్నైలోని నల్లబజారులో బంగారం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారుల బాగోతం పోలీసుల తనిఖీల్లో వెలుగోలోకి వస్తోంది. గురు, శుక్రవారాల్లో కావలి, వెంకటాచలం టోల్‌ప్లాజాల వద్ద సుమారు ఏడున్నర కిలోల బంగారు బిస్కెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లతోపాటు రవాణా చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తీగలాగితే డొంక కదిలినట్లు బంగారం అక్రమ వ్యాపారంపై ఎవరో ఇచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా అక్రమ వ్యాపారం చేసే వారి వివరాలన్నీ బయటపెట్టారు.

● చెన్నై నుంచి తెలంగాణలోని మిర్యాలగూడకు కారులో బంగారం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో కావలి రూరల్ ముసునూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మిర్యాలగూడకు చెందిన తిప్పన సుమతి, ఎర్రబ్ల తేజశ్రీ, షేక్ పర్వీన్, దూరి యాదమ్మ, బంటు శివమ్మ అనే మహిళలు చెన్నైలో బంగారం కొనుగోలుకు బస్సులో వెళుతూ రూ.1,61,49,500 నగదుతో పట్టుబడ్డారు. అలాగే ఒంగోలుకు చెందిన బిట్రా మోహన్, విజయవాడకు చెందిన పగిళ్ల ప్రభాకర్ ఓ కారులో చెన్నై నుంచి సుమారు రూ.కోటి విలువైన 1.497 కిలోల బంగారు బిస్కెట్లను మిర్యాలగూడకు తీసుకెళుతూ పోలీసులకు చిక్కారు. ● వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీఐ అంకమరావు తన సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా చెన్నై నుంచి వస్తున్న కారులో 1.658 కిలోల బంగారాన్ని బంగారాన్ని గుర్తించి, ఎలాంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు. తెలంగాణకు చెందిన వంశీ, రాజాను అదుపులోకి తీసుకున్నారు.

● తాజాగా..

కావలి టోల్‌ప్లాజా వద్ద చెన్నై నుంచి అక్రమ రవాణా చేస్తున్న 3 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. కావలి రూరల్ సీఐ కె.శ్రీనివాస రావు కథనం మేరకు.. బంగారం అక్రమ రవాణాపై సమాచారం అందడంతో ముసునూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం తెల్లవారుజామున సీఐ కె.శ్రీనివాసరావు తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ కారును తనిఖీ చేయగా 2,948 గ్రాముల బంగారం బిస్కట్లను గుర్తించారు. చైన్నైకు చెందిన ఆషిష్‌కుమార్, కమలేష్‌లు విజయవాడకు ఆ బిస్కట్లను తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని బంగారం బిస్కట్లను, కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

● తమిళనాడుకు చెందిన రాకేష్ కుమార్ జైన్, ఆయన భార్య లలితాజైన్‌లు చెన్నై నుంచి కారులో 1.5 కిలోల బంగారాన్ని తరలిస్తుండగా వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద పోలీసులు గుర్తించారు. ఎలాంటి బిల్లులు లేకపోవడంతో బంగారం, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ బంగారం విలువ రూ.1కోటి ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. దంపతులిద్దరినీ అదుపులోకి తీసుకుని, పోలీసులు కేసు నమోదు చేశారు.



నెల్లూరు: పెన్నా బ్యారేజీ వద్ద డివైడర్‌పై ఎండిపోయిన మొక్కలు



నెల్లూరు : జాతీయ రహదారిపై ఎండమావులు



కోవూరు : నిత్యం రద్దీగా ఉండే బజారు సెంటర్ ఇలా..

'ఫ్రై'డే!

- మండుతున్న ఎండలకు వడగాడ్పుల తోడు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు



రోహిణి కార్తెలో రోళ్లు పగులుతాయన్న సామెతను నిజం చేస్తూ ఎండలు మండిపోతున్నాయి. ప్రచండుడి భగభగలకు ప్రజలు విలవిల్లాడి పోతున్నారు. గత నాలుగు రోజులుగా ఎండల తీవ్రత పెరగడమే గాక ఎండలకు వడగాల్పులు తోడవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.ఉదయం 8 గంటలకు వేడిగాలులు వీస్తుండటంతో ఇంట్లో నుంచి బయటకు రావాలంటే సాహసించాల్సి వస్తోంది. అత్యవసర పనుల కోసం తప్ప ఎవరూ బయటకు రాకపోవడంతో పది గంటలకే రహదారులు, బజార్లు, కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యతో ఏసీలు కూడా పని చేయని పరిస్థితి ఏర్పడింది. ఇక ఎండల ధాటికి రోడ్డు డివైడర్ల మధ్యలో ఉన్న మొక్కలు ఎండిపోతున్నాయి. జలవనరుల్లో నీరు సైతం ఇంకిపోవడంతో దాహం తీర్చుకునేందుకు మూగ జీవాలు వెంపర్లాడుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగుతుందన్న అంచనాతో పాటు ప్రజలు భీతిల్లుతున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



బుచ్చిరెడ్డిపాళెం : గొడుగులు, టోపీలు తప్పదు మరి..



భానుడి దెబ్బకు సీతారామపురంలో మూతపడిన దుకాణాలు

మోటార్ బైక్ బోల్తాపడి ఒకరి దుర్మరణం



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు



మృతి చెందిన రమణయ్య

ఉదయగిరి రూరల్, మే 31: పట్టణ శివారు ప్రాంతం కావలి మార్గంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సమీపంలో శుక్రవారం మోటార్‌బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉదయగిరి మండలంలోని నేలటూరు గ్రామానికి చెందిన మేడేపల్లి రమణయ్య(40) అక్కడే దుర్మరణం చెందాడు. కొండాపురం లోని స్నేహితుడి వద్దకు వెళ్లే సమయంలో మోటార్‌బైక్ అదుపుతప్పి రోడ్డుమార్జిన్‌లోని గుంతలోకి దూసుకెళ్లడంతో ఈ సంఘటన జరిగింది. విషయం తెలుసుకొన్న ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. రమణయ్య మృతితో బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

పిచ్చికుక్క స్వైర విహారం

- ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై దాడి

ఉదయగిరి రూరల్, మే 31: పట్టణంలోని షాదీమంజిల్ సమీపంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఇద్దరు చిన్నారులను తీవ్రంగా గాయపర్చింది. ఆడుకుంటున్న చిన్నారులపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచినట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర రక్తగాయాలతో ఉన్న వారిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణంలో వీధికుక్కల బెడద అధికంగా ఉందని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు వీధుల్లో తిరగాలంటే హడలిపోతున్నారని పట్టణ ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు కుక్కల నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సబ్‌స్టేషన్‌కు తప్పిన అగ్నిప్రమాదం

- చెత్తకు నిప్పంటుకుని చెలరేగిన మంటలు
- సమీపంలోనే మద్యం దుకాణం
- సకాలంలో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేత



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక దళం

సంగం, మే 31: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక ఉన్న ముళ్ల కంప, చెత్త కుప్పలో శుక్రవారం మధ్యాహ్నం ఉన్నటుండి మంటలు వ్యాపించాయి. విపరీతమైన ఎండ, పడమటి గాలులతో ఆజ్యం పోసినట్లు ఉండటంతో మంటలు ఎగసిపడ్డాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బం ది ఆందోళన చెంది అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు మంటలు విద్యుత్ సబ్‌స్టేషన్ వైపు రాకుండా సబ్‌స్టేషన్ సిబ్బంది, స్థానికుల సహకారంలో నీటి బిందెలతో నీరు పోసి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంట లు విద్యుత్ సబ్‌స్టేషన్ వైపు రాకుండా కట్టడి చేశారు. ఈ మంటలు ఈశాన్యం వైపు వ్యాపించి అక్కడు ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం చుట్టుముట్టాయి. గమనించిన అగ్నిమాపక సిబ్బంది వాహనాన్ని అటువైపు తీసుకెళ్లి మంటలను ఆర్పడంతో స్థానికులు ఊపిరిపీల్చు కున్నారు. అగ్నిమాపక సిబ్బంది రావడం ఆలస్యమైతే ఇటు విద్యుత్ సబ్‌స్టేషన్, అటు ప్రభుత్వ మద్యం దుకాణం బూడిదైయ్యేవని స్థానికులు చర్చించుకున్నారు. ఎవరో మద్యం సేవించిన వ్యక్తులు అగ్గి పుల్ల గీసి ఆర్పకుండా పడేయడంతో చెత్తకు తగులుకుని పడమటి గాలులలకు మంటలు వ్యాపించి ఉంటాయని ఫైర్ సిబ్బందితో పాటు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దుంగల దొంగ ఎవరు?

- డీఎంహెచ్‌వో కార్యాలయంలో జోనల్ అధికారి పరిశీలన
- పాత భవనం కలప తరలింపుపై విచారణ



దుంగలు తొలగించిన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(వైద్యం), మే 31 : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా విభాగం పాత భవనంలో పైకప్పు ఊడదీసి దుంగలు తరలింపు ఘటనపై విజయవాడ నుంచి వచ్చిన మలేరియా జోనల్ అధికారి వినోద్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. అసిస్టెంట్ డైరెక్టర్ వీర్రాజుతో కలిసి దుంగలు ఊడదీసిన భవనాన్ని పరిశీలించారు. అక్కడ ఉండాల్సిన మందులు ఏమయ్యాయని జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మను అడిగి తెలు సుకున్నారు. మందుల భద్రతకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. దుంగల తరలింపునకు కారకుడిగా అనుమానిస్తున్న మలేరియా విభాగం ఉద్యోగిని ప్రశ్నించారు. రాతపూర్వకంగా వివరణ తీసుకున్నారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని చెప్పారు. వివరాలను రాష్ట్ర ఉన్నతా ధికారులకు నివేదిస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ మలేరియా నివారణ అధికారి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎండవేడిమితో లారీ డ్రైవర్‌కు అస్వస్థత



వైద్యశాలలో చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్

కావలి రూరల్: ఎండవేడిమి తట్టుకోలేక గౌరవరం వద్ద ఓ లారీ డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. టీఎస్ 08 యూఈ 2218 నెంబరు గల లారీని రోడ్డు మార్జిన్‌లో ఆపి డ్రైవర్ కింద కు దిగి కుప్పకూలి పడిపోయాడు. వెంటనే స్థానికులు 1033 నెంబరుకు ఫోన్ చేయడంతో టోల్ ప్లాజా మేనేజర్ గణేష్ హైవే అంబులెన్స్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. వారు సదరు డ్రైవర్ ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. డ్రైవర్ అపస్మారకస్థితిలో ఉండటంతో వివరాలు తెలియరాలేదు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

వెంకటాచలం, మే 31 : వెంకటాచలంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రి పక్కన శుక్రవారం ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పుత్తూరుకు చెందిన ఈశ్వర్ (35)అనుమానాస్పద స్థితిలో ప్రైవేటు ఆసుపత్రి పక్కన మృతిచెంది వున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీ లించారు. మృతుడు ఎలా మృతిచెందాడన్న విషయాన్ని పోలీసులు వివిధ కోణాల్లో పరిశీలిం చారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టమ్ నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	161
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	204


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6880
వెండి కిలో ధర	రూ. 94,800
వెండి ఒక గ్రాము	రూ. 96.80

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నెల్లూరు రూరల్, మే 31 : నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామం వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని శుక్రవారం గుర్తించినట్లు రూరల్ సీఐ మారుతీకృష్ణ తెలిపారు. స్థానిక వీఆర్వో ద్వారా అందిన సమాచారం మేరకు 60-70 ఏళ్ల వ్యక్తి మరణించాడు. మృతదేహంపై నీలిరంగు ప్యాంటు, ఎర్ర రంగు చొక్కా ఉన్నాయని, ఎవరైనా గుర్తుపడితే తమకు తెలియచేయాలని సీఐ కోరారు.



'అరె.. అధికార పార్టీ నాయకులను నమ్ముకుని రాజీనామా చేసి దెబ్బైపో యామే. ఎవరినోట విన్నా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందనే వినిపిస్తోంది. అదే జరిగితే మా పరిస్థితి ఏమిటి!?. రాజీనామా చేశాక పదివేలు ఇస్తామన్న నాయకులూ ముఖం చాటేశారు. తొందర పడ్డామా!? ఇప్పుడు ఎలా!? ఏం చేద్దాం.?' రాజీనామా చేసిన వలంటీర్ల అంతర్మథనం ఇది. విధుల్లో కొనసాగి ఉంటే భవిష్యత్తు ఉండేదేమోననే యోచనలో పడ్డారు. దీనికితోడు వలంటీర్లకు రూ.పది వేల గౌరవ వేతనం ఇస్తామని చంద్రబాబు చెప్పడాన్ని వీరు ప్రస్తావిస్తున్నారు.

ఇప్పుడేం చేద్దాం!

- అంతర్మథనంలో మాజీ వలంటీర్లు
- మొన్న వైసీపీ ఒత్తిడితో రాజీనామా
- ఎన్నికల్లో అధికార పార్టీ విజయం కోసం కృషి
- నేడు కూటమి అధికారంలోకి వస్తుందని జోరుగా చర్చ
- టీడీపీ వస్తే గౌరవ వేతనం రూ. 10 వేలు
- కొనసాగుంటే భవిష్యత్తు ఉండేదన్న భావన

సచివాలయాల సంఖ్య : 769, వలంటీర్ల సంఖ్య : 13,295,
రాజీనామా చేసిన వారు : 3,586, విధుల నుంచి తొలగించిన వారు : 27,
ప్రస్తుతం ఉన్నది : 9,682

సంగం, మే 31 : వైసీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వలంటీరు వ్యవస్థను శ్రీకారం చుట్టి పటిష్టం చేసింది. ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున గ్రామ, వార్డు వలంటీర్లను నియమించారు. వారితో పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు అందించింది. దీంతో ఆ 50 ఇళ్లకు వలంటీర్ కీలకంగా మారారు. దీన్ని గుర్తించిన ఎన్నికల సంఘం గతేదాది జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే వలంటీర్లను ఎన్నికల విధులకు దూరం పెట్టాలని ఆదేశించింది. అయినా అప్పట్లో వలంటీర్లు వైసీపీ కోసం పని చేశారు. తాజా ఎన్నికల్లోనూ అలాంటి ఆదేశాలనే ఇచ్చింది. దీన్ని జిల్లా అధికారులూ పటిష్టంగా అమలు చేశారు. వైసీపీ తరపున ప్రచారం చేసే వలంటీర్లను తొలగించింది. ఆయా నియోజకవర్గాల్లో వలంటీర్ల మీదే పూర్తిగా ఆధార పడిన అధికార పార్టీ అభ్యర్థులు, ఒత్తిడి చేసి వలంటీర్లతో రాజీనామాలు చేయించారు. జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు సుమారు 12 వేల మంది వలంటీర్లు పనిచేస్తుండగా, నోటిఫికేషన్ వచ్చాక 3 వేల మంది రాజీనామా చేశారు. అందులో కావలి, కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో అధికంగా మూకుమ్మడి రాజీనామాలు కనిపించాయి. రాజీనామా చేసిన వలంటీర్లలో ఎక్కువ మందికి ప్రచారం, డబ్బుల పంపిణీ, ఏజెంట్లుగా కూర్చోవడం వంటి బాధ్యతలు అప్పగించారు.

● వలంటీర్లకు మోసం..

వలంటీర్లకు ప్రభుత్వం తరపున రూ.5 వేల గౌరవ వేతనాన్ని వైసీపీ అందిస్తోంది. వేతనం పెంచాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదు. సేవా పురస్కారాల పేరుతో ప్రతి ఒక్కరికి రూ.30 వేల నుంచి పది వేల వరకు అందజేశారు. దీంతో పాటు రేషన్ బియ్యం పర్యవేక్షణకు రూ. 750 ఇస్తామని చెప్పి దాన్ని కూడా అందించలేదు. ప్రభుత్వం చేసిన మోసా న్ని అటుంచితే, జిల్లాలో వైసీపీ నాయకులూ వలంటీర్లను మోసం చేశారు. రాజీనామా చేసిన వలంటీర్లకు రూ. 10 వేలు ఇస్తామని హామీ ఇచ్చి వారితో రాజీనామా చేయించారు. చివరకు ఆ మాటను నిలబెట్టుకోలేదు. జిల్లాలో చాలాచోట్ల వలంటీర్లకు మొండిచేయి చూపగా కొన్ని చోట్ల మాత్రం రూ. 5 వేలు ఇచ్చినట్లు తెలసింది.

● రాజీనామా చేసిన వారిలో ఆందోళన

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుందన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ. 10 వేలు గౌరవ వేతనం ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో రాజీనామా చేసిన వలంటీర్లలో ఆందోళన మొదలైంది. తాము పార్టీ ముద్ర వేసుకోకుండా, తటస్థంగా ఉండి ఉంటే కొనసాగే అవకాశం ఉండేదని లోలోన కుమిలిపోతున్నారు. ఎన్నికల్లో తమను వైసీపీ నేతలు వాడుకుని చెప్పిన డబ్బు కూడా ఇవ్వకపోవడంపైనా అసంతృప్తితో ఉన్నారు. తొందరపడి రాజీనామా చేశామా అని ఇప్పుడు మనస్సులో లోలోన అంతర్మథనం చెందుతున్నారు.

పండ్ల తోటలకు ప్రోత్సాహం

- 6వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- అర్హులైన రైతులకు ఉపయోగం

ఉదయగిరి రూరల్, మే 31 : పండ్ల తోటల పెంపకంలో రైతులను ప్రోత్సహించేందుకు డ్వామా అధికారులు చర్యలు చేపట్టారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మెట్ట భూముల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆసక్తి చూపే రైతులకు పంట రకాన్ని బట్టి మొక్కల కొనుగోలు, గుంతలు తీసింది మొదలు పంట దిగుబడి వచ్చే వరకు వివిధ దశల్లో అయ్యే ఖర్చును 2 నుంచి మూడేళ్లపాటు చెల్లించనుంది.

● ఎవరెవరు అర్హులు..

ఐదు ఎరాలలోపు నీటివసతి ఉన్న రైతులు, గతంలో లబ్ధిపొందని వారంతా ఈ పథకానికి అర్హులు. సాధారణ పండ్ల తోటలతో పాటు రోజా, మల్లె, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్ తదితర 17 రకాల పండ్ల మొక్కలను పెంచేలా కార్యాచ రణ రూపొందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 6వేల ఎకరాల్లో పండ్ల మొక్కలు, పూల మొక్కలు నాటాలన్నది లక్ష్యం. వర్షాకాలం ముగిసేలోపు లక్ష్యాలను పూర్తి చేసే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు, రైతు పట్టాదారు పాసు పుస్తకం, కలిగిన రైతులు మండల కేంద్రాల్లోని ఉపాధిహామీ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు.

● రైతులకు భరోసా..

ఏటా రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోతు న్నారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేప ట్టింది. గ్రామాల్లో ఏపీవో, ఈసీ, టీఏ, ఎఫ్ఏలు రైతులకు అవగా హన కల్పించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపారు. ఎకరానికి 70 నుంచి 100 మొక్కల వంతున రైతుకు అందజేస్తారు. రైతులు కొనుగోలు చేసుకుంటే మొక్కకు రూ.35 చెల్లిస్తారు. రవాణా ఖర్చుల కింద మొక్కకు రూ.5, అంతరపంట వేసుకుంటే రూ.1000, దున్నకానికి రూ.1000, నాటినందుకు రూ.10, గుంత తీసినందుకు ఉపాధి కూలీకి రూ.180 చెల్లిస్తారు. ఎరువులు, కలుపు నివారణ, తెగుళ్ల సోకితే పురుగు మందుల పిచికారీ, ఇతరత్రా ఖర్చులకు మూడేళ్లకు ఎకరాకు రూ.1.1 లక్షల వరకు చెల్లిస్తారు.



సాగులో ఉన్న బత్తాయి తోట

సద్వినియోగం చేసుకోవాలి



తోటల పెంపకం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 37 మండలాల్లో 6 వేల ఎకరాల్లో పెంచాలని లక్ష్యంగా నిర్ణయించాం. వర్షాలు కురిసే నాటికి మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేస్తాం. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారుపాసుపుస్తకం, జాబ్‌కార్డులతో ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలి.

- గాయత్రీదేవి, ఏపీడీ, ఉదయగిరి

పొగాకు ఉత్పత్తులను నిషేధించాలి


- డీఎంహెచ్‌వో పెంచలయ్య
- నగరంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రదర్శన



జెండా ఊపి ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు (వైద్యం), మే 31 : పొగాకు ఉత్పత్తుల వల్ల ప్రాణాంతక వ్యాధులు సోకుతున్నాయని, ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించా లని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య అభిప్రాయపడ్డారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో పొగాకు ఉత్పత్తుల వ్యతిరేక ప్రదర్శన జరిగింది. దీనిని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల నిషేధంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ పొగాకు వల్ల వచ్చే వ్యాధులు, అనర్థాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల గుండె జబ్బులు, కేన్సర్, పక్షవాతం ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం అలవాటును మానటానికి ప్రత్యేకంగా జీజీహెచ్‌లో డీ అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. అనంతరం 'పొగాకు ఉత్పత్తులు వాడం' అంటూ వైద్య సిబ్బంది, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డెమో శ్రీనివాసరావు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులకు 3,600 మంది : కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), మే 31 : మూడంచెల పటిష్ట భద్రతతో చేపడుతున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు 3,600 మంది సిబ్బందిని వినియోగించనున్నట్లు కలెక్టర్ హరి నారాయణన్ చెప్పారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు కేంద్రమైన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యక్షంగా 1100 మంది, పరోక్షంగా 2500 మంది ఓట్ల లెక్కింపులో పాలుపంచుకుంటారని చెప్పారు. సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపును శరవేగంగా చేపట్టనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, రిటర్నింగ్ అధికారులు ఉన్నారు.

● 3 నుంచి 144వ సెక్షన్

ఓట్ల లెక్కింపు శాంతియుతంగా, ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3 నుంచి 6వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 144వ సెక్షన్ అమలు చేయనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడటం, చట్టవిరుద్ధమైన సమావేశాలు, బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- అపస్మా రాష్ట్ర నేతల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అపస్మా నాయకులు

నెల్లూరు (విద్య), మే 31 : జిల్లాలో కార్పొరేట్ పాఠశాలల ఆగడాలకు అంతు లేకుండా పోతోందని, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అపస్మా రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నెల్లూరులోని నేతాజీ పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా నగరంలో ఇష్టానుసారంగా పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ పాఠశాలల వల్ల చిన్న పాఠశాలల ఉనికి ప్రమాదకరంగా మారిందని, ఇంటర్నేషనల్, ఒలంపియాడ్, టెక్నోల పేరుతో ప్రతి ఇంటికి తిరుగుతూ తల్లిదండ్రులను మభ్యపెడుతూ అడ్మిషన్లు చేయడం బాధాకరమ న్నారు. దీనిపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిపై తాము రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అపస్మా నేతలు శ్రీధర్, వెంకట రామయ్య, రామ్మోహన్‌రెడ్డి, వెంకటాద్రి, మల్లికార్జునరెడ్డి, రమేష్, లక్ష్మీరెడ్డి, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈవో సరెండర్

- సిబ్బందికి రివర్షన్

నెల్లూరు (వీఆర్సీ), మే 31 : కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ అధికారిని ప్రధాన కార్యాలయానికి గురువారం సరెండర్ చేశామని ఆ కార్పొరేషన్ ఈడీ రమేష్ తెలిపారు. ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పలు రకాల ఆర్థిక లావాదేవిలలో అవకతవకలు జరిగాయని, దీనిపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించామని చెప్పారు. ప్రభుత్వ మంజూరు లేని పోస్టుల్లో నియామకాలు చేపట్టడం, టైం స్కేలు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి వారికి అదనంగా వేతనాలు చెల్లించడంతోపాటు టీఏ, డీఏలు చట్టవిరుద్ధంగా ఇచ్చి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని నివేదికలో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిధులు సుమారు రూ.20,86,902 దుర్వినియోగం జరిగిందని ఆడిట్‌లో తేలిందన్నారు. నివేదికను ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ , జిల్లా కలెక్టర్‌కు సమర్పించామన్నారు. వారి ఉత్తర్వుల మేరకు అప్పటి ఈడీ, ఈవోతోపాటు మరో 5మందిపై చర్యల్లో భాగంగా జూనియర్ సహాయకులు, సీనియర్ సహాయకులు, స్టెనో, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి రివర్షన్ ఇచ్చినట్లు వివరించారు.

పోలీసు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ పొందిన అధికారులు, సిబ్బందితో ఎస్పీ ఆరీఫ్

నెల్లూరు(క్రైం), మే 31: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి శుక్రవారం ఉమేష్‌చంద్ర సమా వేశ మందిరంలో ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆత్మీ య వీడ్కోలు పలి కారు. డీటీసీలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ డీ సుబ్రహ్మణ్యం, కమ్యునికేషన్ విభాగంలో పనిచేస్తున్న ఎస్ఐ ఐ శేష గిరిరావు, బిట్రగుంట ఏఎస్ఐ ఎం చెన్నయ్య, డీఏఆర్‌లోని ఏఆర్ ఎస్ఐ ఎం వెంకటేశ్వర్లు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కే వెంకటరావు, బీడీ టీమ్ హోం గార్డు ఎం నిరంజన్‌రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. వారిని ఎస్పీ ఘనంగా సత్క రించారు. ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని, అయితే ఒకసారి పోలీస్ గా ఎంపికైతే జీవితాంతం వారు పోలీస్‌గానే ఉంటారన్నారు. శేష జీవితాన్ని ఆయురారో గ్యాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), మే 31 : భారత ప్రభుత్వం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి అందించే పద్మా అవార్డుల కోసం జిల్లాలో అర్హులైన క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. www.padmaawards.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణం గా క్రీడాకారులు దరఖాస్తులను sportsinap@gmail.com కుగానీ, insentives.schemes@ gm ail.comకుగానీ ఆగస్టు 1వతేదీ సాయంత్రం 5 గంటలలోపు మెయిల్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరులో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉన్న డీఎస్ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ

నెల్లూరు (విద్య), మే 31 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప్రధాన పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజున సాంఘిక శాస్త్రం పరీక్ష నిర్వహించారు. 2,625 మంది విద్యార్థులకు 1150 మంది హాజరుకాగా 1475 మంది గైర్హాజరయ్యారు. డీఈవో రామారావు, అధికారులు, స్క్వాడ్ కలిపి ఆరు కేంద్రాలను పరిశీలించాయి. ఈ ఏడాది సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు.

లెక్కింపునకు 4 గంటలే..

- 20రౌండ్లలో తేలనున్న ఆత్మకూరు ఫలితం
- మొదట మర్రిపాడు.. చివరిగా చేజర్ల మండల ఓట్ల లెక్కింపు
- ప్రధాన పార్టీల నాయకుల్లో నరాలు తెగే ఉత్కంఠ



ఆత్మకూరు నియోజకవర్గ చిత్రపటం

ఆత్మకూరు, మే 31: సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం మరో మూడురోజుల్లో తేలనుంది. ఈ నెల 4వ తేదీ నిర్వహించే ఓట్ల లెక్కింపుకు అధికారయం త్రాంగం పూర్తి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 278పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఇందుకు గాను 20రౌండ్లు కౌంటింగ్ నిర్వహించేందుకు 17కౌంటింగ్ టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తు న్నారు. ఆత్మకూరు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఆరంభమైన మూడు, నాలుగు గంటల్లో ఫలితాలు కొలిక్కివస్తాయి. ఈ నేపథ్యంలో మూడురోజుల్లో జరగనున్న ఎన్నికల కౌంటింగ్ అ టు అభ్యర్థుల్లోను, ఇటు ప్రజల్లోను ఆసక్తి రేకెత్తి స్తుంది. ముఖ్యంగా ప్రధాన పార్టీల్లో నరాలుతెగే ఉత్కంఠత నెలకొని ఉంది.

● కౌంటింగ్ ప్రక్రియ ఇలా...:

ముందుగా కౌంటింగ్ ప్రక్రియలో మొదట పోస్టల్ బ్యాలెట్లు, ఆ తరువాత ఈవీఎంలను లెక్కించనున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,15,685 ఓట్లు ఉండగా అందులో 1,78,829ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మరో 2,611 ఉన్నాయి. మొత్తం మీద 1,82,440 ఓట్లను లెక్కించాల్సి ఉంది. మొదట మర్రిపాడు మండలంలోని 1 నుంచి43వ పోలింగ్ బూత్‌లలో పోలైన 28,921ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం అనంతసాగరం మండలంలో 44 నుంచి 89 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 29,752 ఓట్లును లెక్కిస్తారు. తదనంతరం ఆత్మకూరు రూరల్, మున్సిపాల్టీ పరిధిలోని 90ఉంచి 153 పోలింగ్ బూత్‌లలో పోలైన 42,394 ఓట్లు లెక్కిస్తారు. అనంతరం ఏఎస్‌పేట మండలంలోని 154 నుంచి 191 వరకు ఉన్న బూత్‌లలో పోలైన 23,374 ఓట్లు, సంగం మండలంలోని 192 నుంచి 238 బూత్ వరకు పోలైన 30,210ఓట్లు, చివరిగా చేజర్ల మండలంలోని 239 నుంచి 278 పోలింగ్ బూత్‌లలో పోలైన 24,672 ఓట్లను వరుసగా లెక్కిస్తారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఆరంభమైన తరువాత మూడు నాలుగు గంటల్లో ఫలితాలు కొలిక్కి వస్తాయి. అభ్యర్థుల వారీ ఒక్కో రౌండ్‌లో పోలైన ఓట్లుకు సంబంధించి పత్రాలపై ఏజెంట్లు సంతకాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా టేబుల్‌లో ఒక్కొక్క ఈవీఎం లెక్కింపు తరువాత కూడా ఆర్‌ఓ నిర్ధారించాల్సి ఉన్నందున లెక్కింపు పూర్తయినప్పటికీ గెలుపు ఓటములను నిర్ధారించి ప్రకటించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది.

డొంక రోడ్లకు మోక్షమెప్పుడో?

● పొలాల్లోకి వెళ్లేందుకు రైతుల అవస్థ

వలేటివారిపాలెం, మే 31 : మండలంలోని పలు గ్రామాల్లో మాగాణి భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉన్న డొంక రోడ్లు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉన్నాయి. మాగాణి పొలాల్లో వ్యవసాయం సజావుగా సాగాలంటే నీటి వసతి తోపాటు రహదారి సౌకర్యం కూడా ఎంతో అవసరం. దుక్కులు దున్నుకోవడం మొదలు, పంట విత్తుకోవడం, కూలీలు, ఎరువులు సస్యరక్షణకు అవసరమైన పురుగు మందులను పొలాలలోకి చేరవేయడం వరకు.. అనంతరం పొలాల్లో పండిన వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు రహదారి సౌకర్యం చాలా ముఖ్యం. ఈ వసతులు అస్తవ్యస్తంగా ఉంటే తిప్పలు తప్పవు. వలేటివారిపాలెం మండలంలోని వలేటివారిపాలెంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న వేలాది ఎకరాల మాగాణి పొలాల్లోకి రాకపోకలు సాగించేందుకు వినియోగించే కిలో మీటర్ల దూరం ఉన్న డొంకరోడ్లు ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురి కావడంతో రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. శ్రమతో పాటు ఖర్చు కూడా తడిసి మోపెడవుతోంది.

● వర్షాకాలం వస్తే..

ఖరీఫ్‌లో మాగాణి పొలాల వద్దకు వరినారు, కూలీలను చేరవేసేందుకు గతంలో మాదిరి ఎడ్లబండ్లను కాకుండా ట్రాక్టర్లు, ఆటోలు లాంటి వాహనాలను స్థానిక రైతులు వినియోగిస్తున్నారు. ఆ తరువాత ఎరువులు, సస్యరక్షణకు అవసరమైన పురుగుమందులు వాటిని పిచికారి చేసే పరికరాలను పొలాల వద్దకు తరలించేందుకు కూడా ఇవే ఆధారం. అంతేగాకుండా మాగాణి పొలాల్లో పండిన వ్యవసాయ ఉత్పత్తులను బయటకు తరలించేందుకు ట్రాక్టర్లు, లారీలే ఆధారం. లారీలతో పాటు ఈ మధ్య వచ్చిన నూర్పిడి యంత్రాలు పొలాల్లోకి ప్రవేశించాలంటే రహదారి సౌకర్యం తప్పనిసరి. గత కొన్నేళ్లుగా అధికారులు, ప్రజా ప్రతినిధులు డొంకరోడ్లను పట్టించుకోకపోవడంతో రాకపోకలు సాగించేందుకు వీలు లేనంత అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే ద్విచక్ర వాహనాల సంగతి అటుంచితే కాలినడకన సైతం ఈ డొంకరోడ్లలో ప్రయాణించే అవకాశం లేకుండా పోతుందంటే వీటి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతుంది. దీంతో కొన్ని గ్రామాలలో రైతులే వేలలో తమ సొంత నిధులతో కొంత మరమ్మతులు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మాగాణి పొలాల్లోకి వెళ్లే డొంకరోడ్లకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


వలేటివారిపాలెంలో చిల్లచెట్లతో మూసుకుపోయిన డొంకరోడ్డు

ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలి


రికార్డులు పరిశీలిస్తున్న కాన్సెప్ట్ నోడల్ అధికారి దయాకర్

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 31: అర్హులైన ప్రతిఒక్కరికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ నోడల్ అధికారి పీఎల్ దయాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల, డెలివరీ గదులు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యశాలలోని ఇద్దరు వైద్యుల్లో ఒకరు పీహెచ్‌సీ, మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో తప్పక హాజరు కావాలన్నారు. వైద్యశాలలో కాన్పుల సంఖ్య పెంచేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు అయూబ్‌అప్సర్, పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

సోమిరెడ్డిని కలిసిన టీడీపీ నేతలు


సోమిరెడ్డితో అనంతసాగరం టీడీపీ నేతలు

అనంతసాగరం, మే 31: టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత, మాజీ ఎంపీపీ సుబ్బరాజు శుక్రవారం నెల్లూరు పట్టణంలో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తమ గెలుపు తథ్యమని, ఈ మారు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీనే అని వారు ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట సంగరాజు దశరథ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల మార్పులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 31: నర్రవాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1 నుంచి 9వ తేదీ వరకు ఈ ఫీడర్ పరిధిలో ఉదయం 9.45 నుంచి 4.45 గంటల వరకు, వెంగన్నపాళెం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1నుంచి సాయంత్ర 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెర్రెలు బారిన రహదారి


వరికుంటపాడు సమీపంలో దెబ్బతిన్న రోడ్డు


వరికుంటపాడు, మే 31: మండలంలోని పలు గ్రామాల మీదుగా సాగే 565జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారి దర్శనమిస్తోంది. చాలాచోట్ల రోడ్డు నెర్రెలు బారి కుంగిపోయింది. ఈ రహదారి వెంట ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ప్రతినిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ఆదమరిస్తే ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉందని చెబుతున్నారు. రాత్రి సమయంలో పరిస్థితి మరీంత దారుణంగా ఉందని వాపోతున్నారు. ఏ సమయంలో ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు

వింజమూరు, మే 31: పొగాకు విరివిగా వాడుతున్న ప్రజల్లో టీబీ, నోటి కాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ మాసిలామణి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మాసిలామణి హాస్పిటల్‌లో ఆయన రోగులకు పొగాకుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు ప్రతి సిగరెట్ పైన, మందు ఉత్పత్తుల పైన ప్రాణాంతకమని రాసినా ప్రజలు నిత్యం ఉపయోగించడం విచారకరం అన్నారు. ఇందులో యువత పొగాకు ఉత్పత్తులకు బానిసై మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నట్లు చెప్పారు. పొగాకు ఉత్పత్తులను నిలుపు చేయకుంటే రాబోవు రోజుల్లో యువత, చెడు మార్గాలకు గురికాక తప్పదని హెచ్చరించారు.


రోగులకు అవగాహన కల్పిస్తున్న మాసిలామణి

వీరాంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం


తరుణవాయిలో గరుడ వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి


వెంకటంపేటలో ఆంజనేయస్వామి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): వెంకటంపేట రోడ్డుపై వెలసిన వీరాంజనేయస్వామి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదపండితులు స్వామికి గణపతి, కలశ, సహస్రనామ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు జయంతి వేడుకలు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదా రిలోని హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమ జ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. తెల్లవారుజామున 5గంటల నుంచి పంచామృతాభిషేకం, 6నుంచి సహస్రనామపూర్వక ఆకుపూజ, 7నుంచి హనుమంతచాలీసా పారాయణం, 10నుంచి స్వామి సమేత సువర్చలాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహిం చనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా గరుడ వాహనసేవ

సంగం: తరుణవాయి చెన్నకేశవస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండోరోజు గరుడ వాహనంపై స్వామివారు ఊరేగారు. ఈ సందర్భంగ శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవ విగ్రహాలను గజపూలమాలలో అలంకరించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

తీవ్రమైన వడగాలులు.. అనధికార కరెంటు కోతలు

● ఉక్కపోతతో అల్లాడిన జనం

సీతారామపురం, మే 31: మండలంలో మూడురోజులుగా వేసవి తీవ్రత పెరిగింది. మే నెల ముగిసిపోతున్న తరుణంలో ఇప్పటివరకు పెద్దగా ఎండల తీవ్రత లేదని ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలకు శుక్రవారం సూర్యుడు పగలే చుక్కలు చూపించాడు. రోహిణికార్తె అంటేనే రోళ్లు పగిలిపోతాయనే సామెత నిజమేనిపించేలా భానుడు భగభగమంటూ మండిపోయాడు. ఎండకు తీవ్రమైన వడగాల్పులలు తోడయ్యాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు వెనుకాడారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లన్నీ జనాలు లేక నిర్మానుష్యంగా కన్పించాయి. అప్రకటిక కరెంట్ కోతలతో ఏసీలు సైతం మొరాయించాయి. ఫ్యాన్‌గాలి వేడిగా ఉండటంతో ఇళ్లలో ఉన్న ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. తొలిసారిగా గురు, శుక్రవారాల్లో రికార్డుస్థాయిలో ఎండ తీవ్రత 43.5 డిగ్రిల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వేడిమికి తోడు వాతావరణంలో తేమ పెరగడంతో ఉక్కపోత నెలకొంది. వడగాడ్పులు, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. రాత్రుళ్లుకూడా 39డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్, శిక్షణలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు

సంగం, మే 31: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని కాంప్లెక్స్ సమావేశంలో శుక్రవారం పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ మాల్యాద్రి మాట్లాడారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం నూరుశాతం తినేటట్లు నాణ్యతగా తయారు చేయాలని సూచించారు. మెనూలో అన్ని పోషక పదార్థాలు ఉంటేటట్లు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ఏ పదార్థాల్లో ఏ పోషకాలు ఉన్నాయి. వాటితో విద్యార్థులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు జానికీరాం, మల్లయ్య, మండల రిసోర్స్ పర్సన్ మోహన్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

పట్టించుకునే వారేరీ..


చిన్న మసీదు సమీపంలోని డ్రైనేజీని శుభ్రం చేస్తున్న మసీదు నిర్వాహకుడు

ఉదయగిరి రూరల్, మే 31: స్థానిక చిన్నమసీదు వద్ద ఉన్న ప్రధాన రహదారిపై నిర్మించిన మురుగునీటి డ్రైనేజీ చెత్తాచెదారంతో నిండిపోయింది. మసీదు నుంచి వచ్చే మురుగునీరంతా డ్రైనేజీలో నుంచి వెళ్లక రోడ్డుపైనే పారుతోంది. వారంరోజులుగా ఈ సమస్య ఉన్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఈ ప్రాంత ప్రజలు, పాదాచారులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా పట్టించుకోక పోవడంతో చేసేదిలేక శుక్రవారం మసీదు నిర్వాహకులు పైపులు, ఇనుప చువ్వలతో డ్రైయిన్‌లో ఇరుక్కుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి మురుగునీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాల


ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆత్మకూరు. మే 31: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా మెరుగైన విద్య నందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనలో ముందుకు దూసుకుపోతోంది ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. గ్రామీణప్రాంత విద్యార్థుల కోసం 1969లో ఇక్కడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 55ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ కళా శాలలో ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులకు బాసటగా నిలిచింది. ఈ ఏడాది ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 70, ద్వితీయ సంవత్సరంతో 88శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు, కుల్లూరులో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండేవి. అలాంటి పరిస్థితుల్లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పేదవిద్యార్థులకు వరంగా మా రింది. ప్రస్తుతం కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులున్నాయి. వాటితోపాటు ప్రత్యేకవృత్తి విద్యాకోర్సులైన డైరీ సైన్సు, అకౌంట్స్‌అండ్ టాక్సేషన్, కంప్యూటర్ సైన్స్, ఎంపీహెచ్‌డబ్ల్యు(ఎఫ్) కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో మరిన్ని సౌకర్యాలు అందిపుచ్చుకుని మెరుగైన విద్యనందించేందుకు కళాశాల ప్రిన్సిపాల్ వాణి, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

డిప్యూటీ ఈవో ప్రసాదరావు బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ ఈవో ప్రసాదరావును అభినందిస్తున్న బీటీఏ నాయకులు

కందుకూరు, మే 31: కందుకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా ఎంవీవీ ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీటీఏ నాయకులు కళ్లగుంట మోహనరావు, కట్టా రమేష్, షేక్ అబుల్లా, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కొప్పోలు శ్రీనివాసులు, చొప్పర కొండలరావు, వలేటి మాలకొండయ్య, శివన్నారాయణ తదితరులు డిప్యూటీ ఈవోను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

సహజ పానీయాలే శ్రేయస్కరం

కావలిటౌన్, మే 31: శీతల పానియాలకంటే సహజ పానియాలే ఆరోగ్యానికి శ్రేయస్కరమని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఉచిత మజ్జిగ చలివేంద్ర ఏర్పాటు చేశారు. జేవీవీ కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు జానకిరామ్, సుబ్బరామశర్మ, కావలి శాఖ బాధ్యులు జీ హరనాథ్, కల్లయ్య, శ్రీకృష్ణ, వెంకయ్య, పీ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కావలి రూరల్, మే 31: చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెండవ పట్టణ సీఐ కొండ వీటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కావలి పట్టణంలోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో శుక్రవారం పోలీసులు కార్డిన్ సర్చ్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉండటంతో 144 సెక్షన్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గిరిజన కాలనీలో వాహనాలు తనిఖీ చేశారు. పత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో పెన్షన్ పంపిణీ చేయించాలి

కందుకూరు, మే 31: వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పించనఖ నగదును సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పించన్ సొమ్మును బ్యాంకు ఖాతాలలో వేయటం వలన వృద్ధులు, వితంతువులు బ్యాంకుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతుండటమే గాక అనేకమంది ఈకేవైసీ సమస్యలు, ఇతర సాంకేతిక సమస్యలతో అగచాట్లు పడుతున్నారని పేర్కొన్నారు. మరి కొందరికైతే ఏకంగా పించన్ డబ్బులు బ్యాంకుల్లో కట్ అయిపోతుందని పేర్కొన్నారు. నిప్పులగుండంను తలపించేలా ఎండలు మండిపోతున్న తరుణంలో బ్యాంకులకు వెళ్లాల్సివస్తే వృద్ధులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో సచివాలయ ఉద్యోగులతో లబ్ధిదారులకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాల ముస్తాబు

కొండాపురం, మే 31: హనుమజ్జయంతికి మండలంలోని పలుగ్రామాలలో ఉన్న ఆలయాలు ముస్తాబయ్యాయి. మర్రిగుంట, భీమవరప్పాడు తదితర గ్రామాలలో ఏర్పాటు చేసి ఉన్న విగ్రహాల వద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఎండ వేడిమి కారణంగా ఉదయం పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమా లు నిర్వహించేలా నిర్వాహకులు చర్యలు తీసుకుం టున్నారు.

ఘనంగా బీద గిరిధర్ జన్మదినం

అల్లూరు, మే 31 : టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ జన్మదిన వేడుకలను మండల తెలుగు యువత ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నార్తుఆములూరులో స్థానిక నాయకుడు దాసరి కరుణాకర్ నేతృత్వంలో భారీ కేక్‌ను బాలలతో కట్ చేయించారు. అనంతరం వారికి అల్పాహారం ఏర్పాటు చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అల్లూరుపేట పీజీఎం యూత్ బాలలకు పండ్లు, మిఠాయిలు, పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, పెయ్యల బాస్కర్, చల్లా ఇంద్రసేన, ఒట్టూరు బాబు, చల్లా రమణయ్య, ఒట్టూరు మల్లి, ఒట్టూరు కామయ్య, దాసరి రామకృష్ణ, చల్లా శీనయ్య, చల్లా శంకరయ్య, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తిన సభ్యులు


మాట్లాడుతున్న ఎంపీపీ పెన్నా కృష్ణయ్య

లింగసముద్రం, మే 31 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై గళమెత్తారు. తిమ్మారెడ్డిపాలెం ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలోని పాత చెరువులో 10 ఏళ్ల నుంచి పెరిగిన చిల్లచెట్లను తొలగించేందు కు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ జనర ల్ ఫండ్ నిధులతో వాటిని తొలగించుకోవాలని చెప్పారు. అలాగే ఆర్ఆర్ పాలెంలో మంచినీటి పైపులైన్లు పగిలి నీరు కలుషితమై వస్తున్నాయని, ఈ పైపులను మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచు అధికారులను కోరారు. మంచినీటి పథకం నిర్వాహకులతో మాట్లాడి మరమ్మతులు చేయిస్తామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టీ.సాగర్ చెప్పారు. అలాగే కందుకూరు ఆర్టీసీ డిపో అధికారులు వలేటివారిపాలెం నుంచి మాలకొండరాయుని పాలెం, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, చినపవని, పెదపవని మీదుగా కావలికి బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచు వంటేల శ్రీనివాసులు కోరారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. ఇంకా పలువురు ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యశేషుబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడితే చర్యలు

ఉలవపాడు, మే 31 : ఎన్నికల ఫలితాల దృష్ట్యా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై బాజీరెడ్డి అన్నారు. శుక్రవారం ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా వారితో ఎస్సై సమావేశం నిర్వహించారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, దుష్ప్రచారం చేయవద్దని హెచ్చరించారు.

'టీఆర్ఆర్'లో అడ్మిషన్లు ప్రారంభం

కందుకూరు, మే 31: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఎంపీసీలో కళాశాల విద్యార్థిని కుడుముల అఖిల 470కి 460 మార్కులు సాధించడంతో పాటు విద్యార్థులు మంచి ఉత్తీర్ణతాశాతం సాధించారని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన పేద విద్యార్థులు స్వయంగా కళాశాలకు వచ్చి వసతులు, అకడమిక్ పరిస్థితి తెలుసుకుని ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు. జూన్ 1 నుంచి ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

కావలి రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలి


రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, మే 31: కావలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నేతలు శుక్రవారం స్టేషన్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. నేతలు మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం లేనందున వయోవృద్ధులు, రోగులు, వికలాంగులు, పిల్లలు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. లిఫ్ట్ ఏర్పాటుకు అనేకసార్లు మొరపెట్టుకున్నా, నిధులు మంజూరైనప్పటికీ అధికారులు జాప్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఏర్పాటుతోపాటు స్టేషన్ ఆవరణలో పారిశుధ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించాలని, రాత్రివేళల్లో విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, మందా కిరణ్, సమీంద్ర, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు కావలి విద్యార్థిని ఎంపిక


మనశ్విత

కావలిటౌన్, మే 31: కావలిలోని శ్రీప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థిని కొమరా మనశ్విత సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యింది. పోస్టల్ శాఖ ఉద్యోగి కొమరా మల్లికార్జునరావు కుమార్తె మనశ్విత ఏఐఎస్ఎస్ఈఈ పరీక్షల్లో ప్రతిభ కనభబరిచి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అకాడమీ (గుజరాత్ సైనిక్ స్కూల్)లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది. అలాగే నవోదయ ప్రవేశ పరీక్ష రాసి జిల్లాలోనూ 5వ ర్యాంకు సాధించింది. దీంతో శుక్రవారం జనతాపేటలోని శ్రీప్రజ్ఞ కోచింగ్ సెంటర్‌లో కరస్పాండెంట్ దొడ్డవరపు శ్రీనివాసరావు మనశ్వితను, తండ్రి మల్లికార్జునరావును అభినందించారు.

భానుడి భగ భగలు

లింగసముద్రం, మే 31 : రోహిణి కార్తె తన ప్రభావాన్ని చూపుతుండడంతో ప్రజలు మండే ఎండలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గడిచిన నాలుగైదు రోజుల నుంచి ఎండలు మండి పోతున్నాయి. భానుడు సెగలు కక్కుతుండడంతో ప్రజలు 10 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. గురు, శుక్ర వారాల్లో 44 డిగ్రీల ఎండ కాయడంతో మండలంలోని ప్రజలు అలాడిపోయారు. లింగసముద్రం, పెదపవని గ్రామాలలో ఉకాణాలు, రోడ్లు 10 గంటలకే నిర్మాన్యుషంగా మారుతున్నాయి. ఉపాధిహామీ పనులు, ఇతర పనులకు వెళ్లేవారు కూడా ఎండల తీవ్రతకు ముందే ఇళ్లకు చేరుకుంటున్నారు. మండే ఎండలకు తోడు వడగాలులు, విద్యుత్ కోతలు కూడా తోడవడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. ఈ ఎండలు మరో నాలుగు రోజులు ఇలాగే ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

వలేటివారిపాలెం, మే 31 : జూన్ 4వ తేది ఎన్నికల ఫలితాల సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని చుండి, వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి 7 గంటలకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

మంచినీటి బావిలో క్లోరినేషన్

వలేటివారిపాలెం, మే 31 : మండలంలోని నేకునాంపురంలో శుక్రవారం పంచాయతీ సర్పంచు కొల్లూరి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి మాధవి మంచినీటి బావిని క్లోరినేషన్ చేయించారు. బావిలో బ్లీచింగ్ పౌడరుతో పంచాయతీ కార్మికులచే శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్ కొల్లూరి గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

వలేటివారిపాలెం, మే 31 : వలేటివారిపాలెంలో శుక్రవారం రాత్రి సీతారాముల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ముందు రోజు సీతారాముల గ్రామోత్సవం నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. ఈ సందర్భంగా రామాలయంను విద్యుత్ దీపాలతో కనువిందు చేసేలా అలంకరించారు. సీతారాములు, గరుత్మంతుడిని ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో సీతారాములు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో కొబ్బరికాయలు కొట్టి నీళ్లతో వారుపోసి పూజలు చేశారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఎండలు బాబోయ్ ఎండలు

- అల్లాడుతున్న ప్రజలు
- జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యం



కోవూరు : వాహన రాకపోకలు లేక నిర్మానుష్యంగా జాతీయ రహదారి



బుచ్చి బస్టాండ్ వద్ద నిర్మానుష్యంగా ముంబై జాతీయ రహదారి

కోవూరు, మే 31: ఈ ఏడాది వేసవి ప్రతాపం చూపిస్తోంది. గత 15 రోజులుగా ఎండల ధాటికి ప్రజానీకం తట్టుకోలేకపోతున్నారు. కోవూరు పరిసర గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వీధుల్లో జనసంచారం కన్పించడంలేదు. సూర్యప్రతాపాన్ని తట్టుకోలేక పనులన్నింటినీ ఉదయాన్నే చక్కదిద్దుకుంటున్నారు. వడమటి గాలుల వల్ల రైతులు కూడా పొలాలకు వెళ్లడంలేదు. ఎప్పుడూ రద్దీగా ఉండే స్థానిక బజారు కూడలి, తాలుకా ఆఫీసు సెంటర్, మందబయలు కూడళ్లల్లో జనసంచారం నామమమాత్రంగా ఉంది. మధ్యాహ్నం 44 డిగ్రీలు ఉంటున్న ఎండ రాత్రి 9 - 10 గంటల సమయంలో కూడా 40 డిగ్రీలు ఉటోంది. రాత్రి సమయంలో ఉక్కపోతకు వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. గడచిన యాభై సంవత్సరాల్లో ఇంతటి ఎండలు చూడలేదని పలువురు వాపోతున్నారు. ఎండల ధాటిని తట్టుకోలేక ప్రజలు, రైతులు రుతుపవనాల కోసం ఎదురుచూస్తున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలకు తోడు వీస్తున్న వడగాలులకు ప్రజలు అల్లాడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు విలవిల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వాహన రాకపోకలు, జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఆర్టీసీ బస్సులు, ఆటోలలో ప్రయాణాలు సాగించేందుకు జనాలు భయపడిపోతున్నారు. వ్యవసాయ, భవన నిర్మాణ, పలు రంగాల కార్మికులు ఎండలకు అల్లాడుతున్నారు.

గజవాహనంపై శ్రీనివాసుడు



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

పొదలకూరు, మే 31: పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం శ్రీనివాసుడు గజ, హంస వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చాడు. అనంతరం స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి ఇష్టమైన గరుడ వాహన సేవ శోభాయమానంగా జరిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు పి రమణయ్యనాయుడు, విజయలక్ష్మీ, నిర్వాహకులు శ్యాం నాయుడు, జ్యోతి మాల్యాద్రి, కుంకు సురేష్ దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై
చర్యలు లేనట్టేనా!?

విడవలూరు, మే 31: నాడు - నేడు పనులు, పింఛన్ల పంపిణీ, మరుగుదొడ్ల బిల్లులు స్వాహా తదితర అక్రమాలకు పాల్పడిన ముదివర్తి గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా లేదా.. అన్న సందేహాలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ చేస్తున్న అక్రమాలను ఇటీవల గ్రామస్థులు కొందరు మీడియా సమావేశంలో వెలుగులోకి తీసుకు వచ్చారు. దీంతో జిల్లా అధికారులు స్పందిస్తూ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ చేపట్టిన మండలాధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు పంపారు. అయితే రోజులు గడుస్తున్నా ఇంతవరకు సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం పట్ల మండలాధికారుల పనితీరుపై గ్రామస్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉంటే సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్ వైసీపీ నాయకులు వెన్నుదన్నుగా ఉండగా తనపై ఎవరు చర్యలు తీసుకుంటారని ఫిర్యాదుదారులను వేధింపులకు గురి చేయడం కొసమెరుపు.

విచారణ పక్కదారి పట్టిందని ఆరోపణలు

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు శ్రీనివాసులు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఈనెల 24న విచారణ చేపట్టారు. అయితే వైసీపీ నాయకులతో కుమ్మక్కైన విచారణాధికారులు ఇంజనీరింగ్ అసిస్టెంట్ వద్ద ముడుపులు తీసుకుని విచారణను పూర్తిగా పక్కదారి పట్టించారని, అందువలనే గ్రామంలో విచారణ చేయకుండా ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేసి తప్పుడు నివేదికలను అందజేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు సదరు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటారా.. లేదా అన్న అనుమానాలు కలుగుతున్నాయని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. నాపై ఫిర్యాదులు చేశారు... అధికారులు విచారణ చేశారు.. ఇప్పుడేమైందని ఇంజనీరింగ్ అసిస్టెంట్ తమని వేధింపులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై గ్రామంలో పునర్విచారణ జరపాలని కోరుతున్నారు.

'టీఆర్ఆర్'లో అడ్మిషన్లు ప్రారంభం

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ ఓరుగంటి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఎంపీసీలో విద్యార్థిని కుడుముల అఖిల 460 మార్కులు సాధించడంతో పాటు విద్యార్థులు మంచి ఉత్తీర్ణతాశాతం సాధించారని పేర్కొన్నారు. పదవ తరగతి పూర్తయిన పేద విద్యార్థులు స్వయంగా కళాశాలకు వచ్చి వసతులు, అకడమిక్ పరిస్థితి తెలుసుకుని ప్రవేశాలు పొందవచ్చునని పేర్కొన్నారు.

తేనెతుట్టెల తొలగింపు

పొదలకూరు, మే 31 : పట్టణంలోని వాటర్ ట్యాంక్ వద్ద ఎన్నో రోజులుగా ఉన్న తేనె తుట్టెలను గురువారం అర్ధరాత్రి తొలగించారు. బుధవారం తేనెటీగల దాడిలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో 10 మంది గాయాలకు గురైన విషయం విదితమే. తరచూ తేనెటీగల దాడిలో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో స్పందించిన స్థానిక పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు చాటగొట్ల గ్రామానికి సంబంధించిన యువకుల సాయంతో తేనె తుట్టెలను తొలగించారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల



చంద్రబాబుని కలిసిన కురుగొండ్ల

రాపూరు(డక్కిలి), మే 31 : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వెంకటగిరి ఎన్నికల సరళిపై ఆయన చంద్రబాబుకి వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్నామని, 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు విషయంలో అప్రమత్తంగా వుండాలని సూచించినట్లు రామకృష్ణ మీడియాకు ఫోన్‌లో తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పొత్తు, పవన్ కళ్యాణ్ బాగా కష్టపడ్డారని ఇవన్నీ బాగా కలిసొచ్చాయన్నారు.

మంత్రి కాకాణిపై కేసు నమోదు చేయాలి

- పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నేతల ఫిర్యాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, మే 31 : ఎన్నికల ప్రవర్తనా నియమావళికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా తీవ్రమైన పదజాలంతో బెదిరింపులకు పాల్పడిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ సానుభూతిపరులు బొగోలు భాస్కర్‌రెడ్డి, రావూరు సుధీర్, డేగా యశ్వంత్‌రెడ్డిలు వేర్వేరుగా శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేసి లింగంపల్లి గ్రామంలో మంత్రి కాకాణి ప్రసంగించిన తాలూకు వీడియో ఉన్న పెన్‌డ్రైవ్‌ను జతచేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ మే 11న మంత్రి కాకాణి లింగంపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ తన శక్తి ఏమిటో తెలియక ఎగిరెగిరి పడుతున్నారని, 20 రోజుల తర్వాత వారిని దేవుడు కూడా కాపాడలేడన్నారు. గోవర్ధన్ రెడ్డి శక్తి ఏవిధంగా ఉంటుందో చూడాలనుకుంటే అదిచూసి తట్టుకోలేరన్నారు. ఎవరైతే ఎగిరిపడుతున్నారో వాళ్లని విడిచిపెట్టనని ఖచ్చితంగా వాళ్లని తరిమికొడతానని బెదిరించారని, ఇలా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే కాకుండా ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకంగా నడుచుకున్న కాకాణిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము ఎన్నికల అధికారులు, జిల్లా అధికారులను కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ లీగల్ సెల్ స్టేట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడ్వకేట్ సీహెచ్ హరినారాయణ, కేవీఆర్ నాయుడు, ఈ వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, దర్శి విజయ్‌బాబు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పంచముఖి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కొడవలూరు మే 31 : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక పంచముఖి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు వాకాటి పవన్‌కుమార్‌స్వామి శుక్రవారం తెలిపారు.

కాలువ పోరంబోకు భూమి కబ్జా

- పట్టించుకోని అధికారులు



లేఔట్‌కు సిద్ధమవుతున్న కాలువ పోరంబోకు భూమి

బుచ్చిరెడ్డిపాళెం, మే 31: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని సెయింట్ మేరీస్ మీదుగా రేబాలకు వెళ్లే రేబాల కాలువ, హైవే నుంచి రేబాల రోడ్డులో కలిసే దండుబాట రోడ్డుకు మధ్యలో వున్న కొంత కాలువ పోరంబోకు భూమితోపాటు కాలువ కరకట్టను సైతం కుళ్ళబొడిచి వందల ఏళ్ళనాటి చెట్లు కూల్చి కబ్జాకు పాల్పడినా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. రేబాల రోడ్డు నుంచి కాలువ, దండుబాట రోడ్డు పొడవునా సుమారు 100మీటర్ల మేర రూ. 1.50 కోట్లు విలుచేసే (50 సెంట్లు) అరెకరా పోరం బోకు భూమిలో మట్టితోలి చదును చేసి ఇళ్ళప్లాట్లుకు సిద్ధం చేశారు. ఇలా ఇస్కపాళెం, రేబాల రెవెన్యూ పరిధిలో కోట్లు విలువైన కాలువ, దండు బాట పోరంబోకు భూములు ఎకరాల మేర కబ్జా చేసినా ఇటు రెవెన్యూ, అటు ఇరిగేషన్ శాఖల అధికారులెవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదని, ఈ సమస్యను తహసీల్దారుకు దృష్టికి తీసుకెళ్ళినట్టు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు పేర్కొన్నారు.

నైపుణ్యత పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకుడు వీ భాస్కరరావు

కోవూరు, మే 31: అన్ని రంగాల్లో విద్యార్థులు నైపుణ్యత పెంపొందించుకోవాలని ఉపాధ్యాయ జనవిజ్ఞాన వేదిక నాయకుడు వీ భాస్కరరావు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో ఆయన మాటాడుతూ సృజనాత్మకత పెంపొందించుకొనే అంశాలపై దృష్టిపెట్టాలన్నారు. శిబిరంలో కాగితాలను ఉపయోగించి వివిధ రకాల ఆకృతుల్ని తయారుచేసే విధానాన్ని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి, పూర్వ గ్రంథాలయాధికారి జీ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు నవాబుపేటలోని చీదెళ్లవారి సత్రం భవనం

చీదెళ్లవారి సత్రం దురాక్రమణపై
లోకాయుక్త ఆగ్రహం

- రూ.100 కోట్ల ఆస్తిపై దేవదాయ శాఖ నిర్లక్ష్యం
- దాత ఆశయాలకు విరుద్ధంగా పరుల పెత్తనం
- వారసుడి ఫిర్యాదుతో స్పందించిన లోకాయుక్త
- సర్వే చేయాలని ఆదేశాలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 31 : నగరంలోని నవాబుపేటలో గల చీదెళ్లవారి సత్రం దురాక్రమణపై లోకాయుక్త ఆగ్రహం వ్యక్తం చేసింది. దురాక్రమణలపై చర్యలు తీసుకోవాలని దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పోలీసు శాఖకు శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఒకటిన్నర శతాబ్దం క్రితం మూడెకరాల్లో ఏర్పాటు చేసిన సత్రం ఆస్తుల విలువ ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం సుమారు రూ.100 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా.

చీదెళ్లవారి సత్రం నవాబుపేట పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉంది. ఆ సత్రాన్ని చీదెళ్ల వెంకట రాఘవులు శెట్టి 1875వ సంవత్సరంలో నిర్మించారు. అక్కడ తొలుత మామిడితోట, కోనేరుతో పాటు సత్రం, యజమానుల గృహం, 16 ఇళ్లు నిర్మించారు. ఆ ఇళ్లు బాడుగకు ఇచ్చి వాటి ద్వారా వచ్చిన ఆదాయంతో ప్రతి ద్వాదశికి 12 మంది బ్రాహ్మణులకు అన్నదానం చేసేవారు. అలాగే తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సత్రంలోని కోనేరులో తెప్పోత్సవం నిర్వహించి, 300 నుంచి 500 మంది భక్తులకు బంతి భోజనం వడ్డించేవారు. కాలక్రమంలో మామిడితోట, కోనేరు ఆక్రమణకు గురై కనుమరుగయ్యాయి. దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోకి వచ్చేసరికి సత్రంతోపాటు 16 ఇళ్లు మాత్రం ఉన్నాయి. అయితే ఆ శాఖ నిర్లక్ష్యం, రాజకీయ ఒత్తిళ్లతో దాత ఆశయాలు గాలికి కొట్టుకుపోయాయి. అక్కడి ఇళ్లు బినామీల పాలయ్యాయి. దేవదాయ శాఖకు రూ.200 నుంచి 400 వరకు నామమాత్రం బాడుగ చెల్లిస్తూ, బినామీలు బయట వ్యక్తులకు వేలాది రూపాయల బాడుగకు ఇచ్చుకున్నారు. పదేళ్ల క్రితం ఆ సత్రం స్థలంలో గృహ నిర్మాణం జరుగుతుండగా అడ్డుకోబోయిన దేవదాయ శాఖ గుమస్తాపై అప్పటి స్థానిక కార్పొరేటర్ దాడి చేశారు. దీనిపై పోలీసు కేసు కూడా నమోదైంది. చీదెళ్ల సత్రాన్ని నిర్మాత రాఘవులు శెట్టి ఆశయాలకు అనుగుణంగా నిర్వహించాలని ఆయన 6వ తరం వారసుడైన నంబూరు వెంకట సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. సత్రానికి చెందిన మూడెకరాల స్థలంపై సర్వే చేయించాలని, ప్రస్తుతం సత్రం ఇళ్లలో కాపురం ఉంటున్న బినామీలు కరెంటు బిల్లులు, ఆస్తి పన్నులు వారి పేరు మీద కట్టుకుంటున్నారని, వాటిని దేవదాయ శాఖ పేరున మార్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్, పోలీసు, రెవెన్యూ అధికారులకు అర్జీల ద్వారా విజ్ఞప్తి చేశారు. అయితే అధికారులు స్పందించకపోవడంతో సంతోష్ లోకాయుక్తను ఆశ్రయించారు. సత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు పంపమని లోకాయుక్త నోటీసులు ఇచ్చినా అధికారులు స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. సత్రానికి సంబంధించిన భూమిని సర్వే చేయాలని, సత్రంలోని గృహాల కరెంటు బిల్లులు, ఆస్తి పన్నులు సత్రం పేరు మీద చెల్లించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన చర్యలు ప్రతిరోజూ రికార్డు చేయాలని సూచించింది. పూర్తి వివరాలను ఈ ఏడాది జూలై 31వతేదీ నాటికి లోకాయుక్త సమక్షంలో సమర్పించాలని ఆదేశించింది. కాగా, లోకాయుక్త ఆదేశాలపై చీదెళ్లవారి సత్రం కార్యనిర్వహణాధికారి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వారు సమాధానం చెప్పలేదు.

పొగాకు ఉత్పత్తులకు బలవుతున్న యువత

- జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి



డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), మే 31 : పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల ఎక్కువగా యువత దెబ్బతింటోందని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమూర్తి వెల్లడించారు. శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అలెన్ రాయల్ దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడు తూ పొగ తాగటం, పొగాకు ఉత్పత్తుల వాడకంతో అనేక జబ్బులు వస్తాయని తెలిపారు. 30 శాతం గుండె జబ్బులు, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. గుట్కా, ఖైనీలు నమలటం వల్ల నోటి, శ్వాసకోశ కేన్సర్లు వస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం పొగాకు విముక్తి ఆందోళన పేరుతో రూపొందించిన కరపత్రాలు విడుదల చేశారు. డాక్టర్ కృష్ణమూర్తితోపాటు కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ విద్యను నిర్వాహకులు సన్మానించారు ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, పీహెచ్‌పీ నేతలు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, శ్రీధర్‌రావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్రహ్మణ్యంకు ఘనంగా వీడ్కోలు



డాక్టర్ సుబ్రహ్మణ్యం దంపతులను సన్మానిస్తున్న నేతలు

నెల్లూరు(వైద్యం), మే 31 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేసిన డాక్టర్ సుబ్రహ్మణ్యం ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. పలువురు వైద్యులు, ఉద్యోగ సంఘం నాయకులు డాక్టర్ సుబ్రహ్మ ణ్యం దంపతులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఆసుపత్రి ఏడీ ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ హెల్త్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ మాట్లాడుతూ అంకితభావం, సేవానిరతితో మూడు దశాబ్దాలుగా డాక్టర్ సుబ్రహ్మణ్యం విధులు నిర్వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సందానీ బాషా, అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ గంగాధర్, హెడ్‌నర్సు వరలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ గిరిజ, పచ్చ మహేంద్ర, పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు. హంస జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చేజెర్ల సుధాకర్‌రావు, కమల్‌కరణ్ డాక్టర్ సుబ్రహ్మణ్యంకు అభినందనలు తెలిపారు.

న్యాయశాఖ ఉద్యోగులకు..



నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న న్యాయాధికారి యామిని

నెల్లూరు(లీగల్), మే 31 : జిల్లా కోర్టులో నజారత్ సెక్షన్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న డీ నాగేశ్వరరావు, ఏవో బ్రాంచి అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే శ్రీధర్ ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి పీ యామిని ఆధ్వర్యంలో న్యాయ శాఖ ఉద్యోగులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలి కారు. ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ నాగేశ్వరరావు, శ్రీధర్ 40 సంవత్సరాలుగా న్యాయ శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వై నరేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి పీ నారాయణరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు ఎంపీ శివకుమార్, కార్యదర్శి కే దీపక్ తదితరులు పాల్గొన్నారు.

హంస కృషితో స్టాఫ్‌నర్సుల కొనసాగింపు

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్



మాట్లాడుతున్న చేజెర్ల సుధాకర్

నెల్లూరు(వైద్యం) మే 31 : ప్రకాశం జిల్లాలోని మూ డు పీహెచ్‌సీలలో స్టాఫ్ నర్సుల తొలగింపు ఉత్తర్వులను హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసో సియేషన్) కృషితో ప్రభుత్వం రద్దు చేసిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్ రావు తెలిపా రు. శుక్రవారం నగరంలో సంఘం సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలలో ఒక్క కాన్పుకూడా జరగలేదని ముగ్గురు స్టాఫ్‌నర్సుల తొలగింపుకు ఆదేశాలు ఇవ్వటం అన్యాయమన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఉద్యోగులపై సానుభూతితో వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో మాట్లాడటంతో ఆ అనుమతులను రద్దు చేశారని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాలకు ప్రభుత్వం అను మతులు ఇవ్వటం వల్లే కొన్ని పీహెచ్‌సీలలో ప్రసవాలు చేయించుకునేందుకు ఎవరూ రావడం లేదని ఆరోపించా రు. వాస్తవాలు తెలుసుకోకుండా అధికారులు ఇలాంటి నిర్ణ యాలు తీసుకోవటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో హం స ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్ పాల్గొన్నారు.



నేడు హనుమజ్జయంతి

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 31 : రామభక్తుడైన హనుమంతిని పుట్టినరోజు పండుగ హనుమజ్జయంతికి నగరంలోని వైష్ణవాలయాలు సిద్ధమయ్యాయి. శనివారం ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరగనున్నాయి. కాగా, శబరి శ్రీరామక్షేత్రంలో కొన్ని రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో శుక్రవారం ఉదయం అభిషేకం, అర్చన, హోమం, నివేదన, హారతులు, ప్రసాద వినియోగం జరిగాయి. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకారం, హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. శనివారం ఉదయం 10గంటలకు లక్ష మల్లెల అర్చన, రాత్రి 10 సంవత్సరాలలోపు పిల్లలకు వెండి డాలరు కంకణధారణ, 7.30గంటలకు గ్రామోత్సవం, 8గంటలకు పల్లకీసేవ జరగనున్నాయి.

- మైపాడు గేట్ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం 6గంటలకు అభిషేకం, విశేష పూజలు, 12 గంటలకు అన్నదానం, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి పల్లకీసేవ జరుగుతాయి.
- బాలాజీనగర్ సాయిదర్బార్‌లో ప్రత్యేక అభిషేకాలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం, అన్నదానం జరుగుతాయి.
- సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో కొలువైన కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ఉదయం అభిషేకం, 9.30గంటలకు 1,08,000 తమలపాకులతో అర్చన, మన్యుసూక్త హోమం, రాత్రి పల్లకీసేవ జరుగుతాయి.
- రాయాజీవీధిలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలు, ఆకుపూజ, హోమం, అన్నదానం జరుగుతాయి.
- పప్పులవీధి ప్రసన్నంజనేయస్వామి ఆలయంలో ఉదయం 7గంటలకు లక్ష తమల పాకులతో పూజ, 10.30 గంటలకు తిరుమంజన సేవలు జరుగుతాయి.

రక్తదాన శిబిరం



విశ్వమాతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నెల్లూరు (సాంస్కృతికం) మే 31 : విశ్వమాతా సేవా ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోని సేవా బ్లడ్ బ్యాంకులో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నిర్వహించిన రక్తదాన శిబిరం శుక్రవారం విజయవంతమైంది. గునుకుల కిషోర్, కత్తెర మల్లికార్జున్, పసుమర్తి కిషోర్, గులాం హుసేన్, దగ్గుపాటి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కల్యాణి, పంచాగ్నుల పవన్‌కుమార్, నీరజ్, మురళీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు.




జూకు కొత్తగా రెండు తోడేళ్లు

మంగళం, మే 31: తిరుపతిలోని ఎస్వీ జూపార్కుకు కొత్తగా రెండు తోడేళ్లు తెప్పించారు. యానిమల్ ఎక్స్ఛేంజ్ స్కీమ్‌లో భాగంగా బెంగళూరులోని బన్నారగుట్ట జూపార్కు నుంచి ఒక ఆడ, ఒక మగ తోడేళ్లను తిరుపతికి తీసుకొచ్చారు. అలాగే ఇక్కడినుంచి రెండు హైనాలను బెంగళూరు జూకు పంపారు. తీసుకొచ్చిన రెండు తోడేళ్లను 45రోజులపాటు అబ్జర్వేషన్‌లో ఉంచి అనంతరం సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్‌లో వదలనున్నారు. ఇటీవల జూకు తీసుకొచ్చిన నీటి ఏనుగులు.. సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

మరిన్ని జంతువులను తీసుకొస్తాం

గోవా, హైదరాబాదు, చెన్నై జూలనుంచి త్వరలోనే మరిన్ని కొత్త జంతువులను తీసుకొస్తాం. అలాగే ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఫీడ్ వెహికల్, జంతువులకు మత్తు ఇచ్చేందుకు ఉపయోగించే గన్ను, సందర్శకుల దాహార్తి తీర్చేందుకు జూలో ఆర్వో ప్లాంట్‌ను తదితరాలను రూ.19.4లక్షలతో ఏర్పాటు చేస్తున్నాం. రాత్రిపూట మాత్రమే సంచరించే జంతువుల కోసం ఏర్పాటు చేస్తున్న ఎన్‌క్లోజర్ పనులు వేగవంతం చేశాం. త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

- సెల్వం, జూ క్యూరేటర్



'కౌంటింగ్'కు పటిష్ఠ భద్రత

- 2,549 మంది పోలీసులు, కేంద్రబలగాల మోహరింపు
- మూడు డ్రోన్లతో వీడియో చిత్రీకరణ
- ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి

తిరుపతి(నేరవిభాగం), మే 31: కౌంటింగ్ రోజున పటిష్ఠ భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధనరాజు తెలిపారు. తిరుపతిలోని పోలీసు అతిథి గృహంలో సీఐడీ ఎస్పీ సరిత, అదనపు ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, వెంకట్రావులతో కలసి శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ రోజున కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా దాదాపు 2,549 మంది పోలీసులతో భారీ భద్రత ఉంటుందన్నారు. వీరితోపాటు రెండు కంపెనీల సీఐఎస్ఎఫ్ ఫోర్సు, ఆరు ప్లటూన్ల కేంద్ర బలగాలు, 30 మంది తమిళనాడు పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు రెండు కంపెనీలు, సివిల్ సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సాయుధ బలగాలు అందుబాటులో ఉంటారన్నారు. అదనంగా మరో రెండు కంపెనీల కేంద్ర బలగాలు తిరుపతికి వస్తున్నాయని వెల్లడించారు. పోలింగ్ తర్వాత చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం నేపథ్యంలో ముందస్తుగా అభ్యర్థులందరికీ 1+4 భద్రతతోపాటు ప్రత్యేకంగా ఎస్కార్టు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో ఘర్షణలు, అల్లర్లు, విధ్వంసాలు ఇతరత్రా ఘటనలకు సంబంధించి 310 మందిని గుర్తించగా.. దీనిపై ఐదుగురు పోలీసు అధికారులతో కూడిన కమిటీ సూచించిన 57 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశామన్నారు. ఇందులో ఎలాంటి వివక్ష లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నాలుగు అంచెలతో..

పద్మావతి మహిళా వర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రస్తుతం మూడంచెల భద్రత ఉందని, కౌంటింగ్ రోజున నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు, పోలింగ్ సిబ్బంది, అభ్యర్థులకు సంబంధించిన గన్‌మెన్ తప్ప ఇతరులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. మీడియా పాయింట్ వద్దకు ఎన్నికల కమిషన్ పాసులున్న వారిని అనుమతిస్తామని, ఓబీ వ్యాన్లకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లు ఎస్పీ చెప్పారు. 144 సెక్షన్, 30 పోలీసు యాక్టును గట్టిగా అమలు చేస్తామన్నారు. వీలైనంత వరకు కౌంటింగ్ రోజున ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉంటే మంచిదన్నారు.

25 చెక్‌పోస్టులు

కౌంటింగ్ కేంద్రం చుట్టూ 25 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. ఎవరైనా మద్యం తాగి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ నో ఫ్లయింగ్, రెడ్ జోన్ ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ కేంద్రం వద్ద మూడు డ్రోన్లతో వీడియో చిత్రీకరణ ఉంటుందన్నారు. కౌంటింగ్ కేంద్రం భద్రతకు ఎలాంటి ఢోకా లేదన్నారు.

నిర్దేశించిన రూట్లు ఇవే..

అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ కేంద్రం వద్దకు కూడా నిర్దేశించిన రూట్ల ద్వారా మాత్రమే రావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఆరు నియోజకవర్గాలకు ఇలా..

చంద్రగిరి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు, సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు జాతీయ రహదారి మీదుగా రామానుజపల్లె చెక్‌పోస్టు, తుమ్మలగుంట క్రాస్, పద్మావతి మహిళా వర్సిటీ కటాఫ్ నుంచి పెద్ద గేటు ద్వారా కౌంటింగ్ కేంద్రంలోకి చేరుకోవాలి. లోపల ఏర్పాటు చేసిన నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి.

- మిగిలిన ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది జాతీయ రహదారి నుంచి ఆర్సీపురం జంక్షన్, అన్నమయ్య సర్కిల్, ఎంఆర్‌పల్లె సర్కిల్, పొంగులేటి సీతమ్మ రోడ్డు వద్దకు చేరుకుని, అక్కడ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు ఉంచాలి. ఆ తర్వాత నడుచుకుంటూ కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లాలి.

తిరుపతికి ఇలా..

తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులు, జనరల్ ఏజెంట్లు, ఆర్వోలు, ఏఆర్వోలు, పరిశీలకులు.. వెంగమాంబ సర్కిల్, రాళ్లపల్లి విగ్రహం, పద్మావతి మహిళా వర్సిటీ చిన్న గేటు మీదుగా కౌంటింగ్ కేంద్రంలోకి చేరుకోవాలి. వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకోవాలి.

- మిగిలిన ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది ఎంఆర్‌పల్లె సర్కిల్ మీదుగా పొంగులేటి సీతమ్మ రోడ్డు ఎంట్రీ పాయింటు వద్ద వాహనాలను ఆపేయాలి. తర్వాత నడుచుకుంటూ కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి. నడవలేని వారి కోసం ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలను ఉపయోగించుకోవచ్చు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

అడుగడుగునా నిర్లక్ష్యం

చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై వేటుకు కారణం

ఆయన స్నేహితుడి అధీనంలో అధికారిక వాహనం

తిరుపతి (నేరవిభాగం), మే 31: చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌పై బదిలీ వేటు పోలీసువర్గాల్లో చర్చగా మారింది. మూడు నెలల క్రితం తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నుంచి చంద్రగిరి డీఎస్పీగా వచ్చిన శరత్‌రాజ్‌కుమార్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపించారనే విమర్శలున్నాయి. చంద్రగిరికి ఎన్నికల కమిషన్ ఆయన్ను నోడల్ అధికారిగా నియమించింది. రామిరెడ్డిపల్లె, కూచువారిపల్లె, బ్రాహ్మణకాలువ గ్రామాల్లో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోవడం వెనుక పోలీసు అలసత్వానికి ఆయనే బాధ్యుడని భావిస్తున్నారు. కూచువారిపల్లెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలపై వైసీపీ శ్రేణులు కర్రలు, రాడ్లతో దాడిచేసి, తీవ్రంగా గాయపరచినా నిందితులపై కేసులు నమోదు చేయడంలో డీఎస్పీ పూర్తిగా విఫలమయ్యారు. తాము కూచివారిపల్లెని సందర్శించిన తర్వాతే కేసులు నమోదు చేయడాన్ని సిట్ బృందం తప్పు పట్టింది. కొటాల చంద్రశేఖర రెడ్డి ఇల్లును తగులపెట్టినా ఆ తర్వాత అప్రమత్తం కావాల్సిన పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. తొలి నుంచి ఆయన వైసీపీకి వీర విధేయుడిగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా వుండగా డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌కు పోలీసు శాఖ కేటాయించిన ప్రభుత్వ వాహనాన్ని ఆయన స్నేహితుడు, కడపకు చెందిన సుదర్శన్ వాడుతున్నట్టు కూడా అధికారుల దృష్టికి వచ్చింది. నర్సింగ్ కాలేజీ యజమాని అయిన ఆయన పోలీసు స్టిక్కరున్న వాహనాన్ని దర్జాగా వాడుకునేవారన్న ఆరోపణలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం పోలీసు కారులో సుదర్శన్ మహిళా వర్సిటీ స్ట్రాంగ్ రూము లోపలకు వెళ్లడానికి ప్రయత్నించాడని అంటున్నారు. డీఎస్పీ వర్సిటీ లోపల విధుల్లో వుంటే ఆయన కారులో ఎవరు వస్తున్నారు అనే అనుమానంతో అక్కడ వున్న సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నించారని తెలిసింది. వారిని దబాయించిన ఆయన కారును నేరుగా స్ట్రాంగ్‌రూము వద్దకు తీసుకెళ్లారని అంటున్నారు. దీనిపై ఎస్బీ పోలీసులు ఎస్పీకి సమాచారం అందించారు. డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎస్పీ రిపోర్టు పంపడంతో ఆయన్ను వీఆర్‌కు పంపారు. ఆయనపై వేటు వేయడానికి ప్రధాన కారణం శాంతి భద్రతల పరిరక్షణకు కేటాయించిన కారును దుర్వినియోగం చేయడం. శాంతి భద్రలను గాలికి వదిలేయడం అని అంటున్నారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా రవికుమార్

తిరుపతి క్రైం డీఎస్పీ రవికుమార్‌ను చంద్రగిరి ఇన్‌చార్జి డీఎస్పీగా నియమించారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి రూరల్, కూచివారిపల్లె, బ్రాహ్మణకాలువ, రామిరెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. కౌంటింగ్ రోజు, ఆ తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు.



తిరుపతిలో బోసిపోతున్న ఫ్లైఓవర్, రహదారి

వామ్మో ఇవేమి ఎండలో..!

వేడి, ఉక్కపోతతో జనం బెంబేలు • డీవీసత్రంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

తిరుపతి(కలెక్టరేట్), మే 31: జిల్లాలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. భానుడి ప్రతాపానికి జనం వేడి, ఉక్కపోతతో బెంబేలెత్తుతున్నారు. రోహిణికార్తె కావడంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. సాయంత్రం ఆరు గంటల వరకు వేడి వాతావరణం ఉండటంతో వృద్ధులు, గర్భిణిలు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే తిరుపతి నగరంలోని రహదారులు కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి. శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల, తిరుచానూరు ప్రముఖ ఆలయాల వద్ద భక్తులు ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం డీవీసత్రంలో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చిల్లకూరులో 43.7, గూడూరు, నాగలాపురం, నాయుడుపేట, పిచ్చాటూరుల్లో 43.6, మిగిలిన మండలాల్లో 42డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పాకాలలో మాత్రం అత్యల్పంగా 38.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



శ్రీవారి ఆలయం ముందు నీటిని చల్లుతున్న పారిశుధ్య మహిళ

వడదెబ్బతో వృద్ధురాలి మృతి



పద్మావతమ్మ(ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, మే 31: రెండు రోజులుగా భానుడి భగభగలకు భరించలేని ఓ వృద్ధురాలు వడదెబ్బకు గురై మృతి చెందింది. చంద్రగిరిలోని నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన రావూరి పద్మావతమ్మ(84) ఎండ తీవ్రత తట్టుకోలేక.. తీవ్ర అస్వస్థతకు గురై గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మామండూరులో ఏనుగుల బీభత్సం



మామిడితోపులో ఏనుగు

రేణిగుంట, మే 31: రేణిగుంట మండలం మామండూరులోని మామిడితోపుపై రెండు ఏనుగులు పడి బీభత్సం సృష్టించాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. రెండ్రోజుల కిందట ఏనుగుల గుంపు మామిడితోపు సమీపంలో వచ్చి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం రెండు పెద్ద ఏనుగులు మామిడితోపులోకి ప్రవేశించాయి. చెట్లను విరిచేసి, కాయలు రాల్చేస్తూ బీభత్సం సృష్టించాయి. గ్రామస్తులంతా గుమికూడి పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ.. అతికష్టంపై వాటిని అడవుల్లోకి తరిమేశారు. కాగా, గత నెల 8వ తేదీన కూడా ఏనుగుల గుంపు దాదాపు 60 ఎకరాల్లోని మామిడి చెట్లను ధ్వంసం చేసిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పూడిపోయిన కందకాలను బాగుచేసి, ఏనుగుల బారి నుంచి రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

15 కిలోల గంజాయి స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న సెబ్ అధికారులు

గూడూరు, మే 31: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎస్ఈబీ కార్యాలయంలో సీఐ రమేష్ మీడియాకు వివరాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా బీరోలే గ్రామానికి చెందిన పాపన్న గూడూరు ఆర్టీసీ బస్టాండు సమీపంలో వినాయకగుడి వద్ద బ్యాగును తగిలించుకుని అనుమానాస్పదంగా కనిపించాడు. తనిఖీ చేయగా, అతడి వద్ద 15 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పాపన్నను అదుపులోకి తీసుకుని, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోసెస్, కానిస్టేబుళ్లు కిరణ్‌సింగ్, ప్రసాద్, కృష్ణయ్య, గౌస్‌బాషా, ఆనంద్‌బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలు నేటినుంచి పునఃప్రారంభం

తిరుపతి(విద్య), మే 31: జిల్లాలో జూనియర్ కళాశాలలు శనివారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. 22 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ తరగతులతోపాటు ప్రథమ సంవత్సర ప్రవేశాలు కూడా చేపట్టనున్నారు.

పాఠ్య పుస్తకాల కొరత : ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల కొరత కనిపిస్తోంది. ఎందుకంటే కళాశాలలు పునఃప్రారంభం కావస్తున్నా ఇప్పటికీ పుస్తకాల పంపిణీ జరగలేదు. రెండేళ్లుగా పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందించలేకపోయిందని, ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, శనివారం అధ్యాపకులంతా తప్పనిసరిగా కళాశాలలకు హాజరై, బయోమెట్రిక్ వేయాలని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్‌కి 189మంది హాజరు

తిరుపతి(విద్య), మే 31: తిరుపతి కేటీరోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో జరుగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్‌కు శుక్రవారం 189మంది విద్యార్థులు హాజరై తమ సర్టిఫికెట్లు వెరిఫై చేసుకున్నారని కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. 59001-75000 ర్యాంకుల వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించామని తెలిపారు. శనివారం 75001-92000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ డిగ్రీ, పీజీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 31: ఎస్వీయూ పరిధిలో నిర్వహించే డిగ్రీ రెండు, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు జూన్ 12వ తేదీ నుంచి జూలై 2 వరకు జరుగుతాయి. అదేవిధంగా పీజీ రెండు, నాల్గవ సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు నోటిఫికేషన్ విడుదలైంది. సంబంధిత వివరాలకోసం ఆయా ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లో సంప్రదించాలని సీఈ దామ్లా నాయక్ పేర్కొన్నారు.

పులివర్తి నానీకి టీడీపీ నాయకుల పరామర్శ



పులివర్తి నానీని పరామర్శిస్తున్న రాజేంద్ర తదితరులు

నాయుడుపేట, మే 31: చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృ హంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రాజేంద్ర, నాయకులు పరామర్శించారు. ఇటీవల వైసీపీ మూకల దాడిలో ఆయన గాయపడడంతో ఈ మేరకు పరామర్శించారు. చంద్రగిరి భారీ మెజార్టీతో టీడీపీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజేంద్ర వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నారావు, నాయకులు చెంగయ్య, పవన్‌కుమార్, జెడ్డా తదితరులున్నారు.

వృక్ష సంపద అక్రమంగా నరికివేత



శ్రీనివాసపురం వద్ద రోడ్డుపై పడి ఉన్న మొద్దు

నాయుడుపేట, మే 31: వాల్టా చట్టం ఉల్లా అయ్యింది. నిబంధనలకు విరుద్ధంగా వృక్షసంపదను నరికి శుక్రవారం తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాసపురం రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షసంపదను అక్రమంగా నరికి ట్రాక్టర్లల్లో తరలిస్తున్నారు. చెట్లను నరకాలంటే వాల్టా చట్టం 2004 ప్రకారం మొదటగా తహసీల్దారుకు తెలియజేయాల్సి ఉంది. ఎటువంటి అనుమతులు లేకుండా బాహాటంగా చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ... శ్రీనివాసపురంలో చెట్లు నరికివేతకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

చేయూత అనాథాశ్రమం తనిఖీ



పిల్లలతో మాట్లాడుతున్న డీఈవో

నాయుడుపేట, మే 31: పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలోని చేయూత అనాథాశ్రమాన్ని తిరుపతి జిల్లా డీఈవో వి.శేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆశ్రయం పొందుతున్న పిల్లలతో మాట్లాడారు. అక్కడ కల్పిస్తున్న సదుపాయాలు, ఆహారం, విద్య, వసతులపై ఆరా తీశారు. తల్లిదండ్రులకు పిల్లలు ఏ విధంగా దూరమయ్యారో ఆశ్రమ నిర్వాహకుడు తొప్పాని కృష్ణను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాయుడుపేటలో టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్న జడ్పీ బాలుర, జడ్పీబాలికల, నారాయణ పాఠశాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎమ్మార్పీ శ్రీధర్‌బాబు, సీసీ కుమార్, మధు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు



పూజల్లో చిరంజీవి కుటుంబీకులు

గూడూరు, మే 31: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాలని ఆకాంక్షిస్తూ దీక్షచేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నట్లు ఆ పార్టీ అభిమాని చిరంజీవి శుక్రవారం తెలిపాడు. పట్టణానికి చెందిన చిరంజీవి ఫిజియోథెరిపిస్టు. చిరంజీవి భార్య రేవతి గూడూరు నియోజకవర్గ తెలుగు మహిళా కార్యదర్శి. వీరి కుమారుడు అనిత్‌కుమార్ కూడా పలు బహిరంగ సభల్లో చంద్రబాబును, టీడీపీని పొగుడుతూ ప్రసంగాలు చేస్తూ టీడీపీ బుడ్డోడుగా పేరు తెచ్చుకున్నాడు. చంద్రబాబు సీఎం కావాలని గూడూరు ని యోజకవర్గంలో పాశిం సునీల్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలవాలని 11 శుక్రవా రాలు ఉపవాసంతో జొన్నవాడ కామాక్షమ్మ దీక్షలు చేపట్టి ఈ శుక్రవారం మోకాళ్లపై అమ్మవారి ఆలయంలో ప్రదక్షణలు చేసినట్లు చిరంజీవి తెలిపారు.

పొగాకు ఉత్పత్తులు హానికరం



మాట్లాడుతున్న డాక్టర్ షరీనా

గూడూరు అర్బన్, మే 31: పొగాకు ఉత్పత్తులు వినియోగించడం ఆరోగ్యానికి హానికరమని ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ షరీనా అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పొగాకు ఉత్పత్తులను వినియోగించడం వలన శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ సోకుతాయన్నారు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మధుసూదన్, ప్రియాంక, మోహన, సిబ్బంది గౌరీ, లలిత పాల్గొన్నారు.

కారు బీభత్సం

గూడూరు అర్బన్, మే 31: మద్యంమత్తులో యువకుడు కారును అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటన గురువారం రాత్రి పట్టణంలో జరిగింది. నాయుడుపేటలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్న ఆకాష్ కారులో గూడూరు రైల్వేస్టేషన్‌లో అతని స్నేహితుడిని దింపాడు. అక్కడినుంచి అతివేగంగా ఆసుపత్రిరోడ్డు, సంఘం థియేటర్ మీదుగా శివాలయంవీధిలో కారును నడపడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. శివాలయం వీధిలోని ఓ స్పీడ్‌బ్రేకర్‌ను కారు ఢీకొని నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఆకాష్‌కు దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టణ సీఐ పాపారావు డ్రంక్ అండ్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 31: పట్టణంలోని అడవయ్య కాలనీలో ఉన్న గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో శుక్రవారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో కె.రవీంద్రబాబు, జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు...





నిర్మానుష్యంగా ఉన్న ఆర్టీసీ రోడ్డు - ప్రయాణికులు లేక వెలవెలబోతున్న పాత బస్టాండు

గూడూరు, మే 31: వడగాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోహిణి కార్తె మొదలు కావడంతో గత రెండు రోజులుగా పట్టణంలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలుగా నమోదవుతోంది. ఉదయం 8గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావాలంటే ప్రజలు భయపడిపో తున్నారు. సాయంత్రం 5.30 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఇంట్లో ఫ్యాన్లు వేసుకున్నా ఉక్కపోత తగ్గకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రతకు పట్టణంలోని ప్రధాన రోడ్డైన ఆసుపత్రిరోడ్డు, ఆర్టీసీ బస్టాండు రోడ్డు తదితర ప్రాంతాలు సాయంత్రం వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పాత బస్టాండులో ఖాళీగా దర్శనమిస్తోంది. సెలవులు కావడంతో సాయంత్రం 3 గంటల నుంచే క్రీడాకారులతో కళకళలాడే ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియం వెలవెలబోతుంది. పనుల మీద తిరిగేవారు గొడుగులను, టోపీలను ఆశ్రయిస్తున్నారు.

రూ.800 కోట్లతో రాష్ట్రంలో జూడో మార్షల్స్ విస్తరణ

ఒలంపిక్స్‌లో బంగారు పతకం లక్ష్యం ● జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూరయ్య



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగూరయ్య

నాయుడుపేట, మే 31: ఆదరణ కనుమరుగవుతున్న పురాతన మార్షల్ ఆర్ట్స్ జూడోను రూ.800 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడమే లక్ష్యమని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు ఏ.నాగూరయ్య అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1884లో ఆవిర్భవించిన జూడో వ్యక్తిగత సంరక్షణ క్రీడ అన్నారు. ప్రధానంగా బౌద్ధమత దేశాల్లో ప్రాచుర్యంలో ఉందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వెళ్లిన రవీంద్రనాథ్ ఠాగూర్ అక్కడ గమనించిన జూడోను భారతదేశానికి పరిచయం చేశారన్నారు. కొంతకాలం జూడోకి ప్రాచుర్యంలో ఉన్న తరువాత క్రమంగా కనుమరుగైందన్నారు. జీబీసీ మీడియా హౌస్ జూడోకు ప్రాచుర్యం కల్పిస్తోందన్నారు.

ఒలంపిక్స్ లక్ష్యం...

జాతీయ, ఆసియా స్థాయి క్రీడల్లో జూడోలో రాణించడంతోపాటు 2032 ఒలంపిక్స్‌లో బంగారు పతకాలు సాధించడం లక్ష్యంగా జూడో అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఓజిలి మండలం పెద్దపరియవద్ద ఉన్న క్రీడా కళాశాలలో రూ.200 కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో క్రీడాకారుల కోసం ప్రత్యేక ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రీడా కళాశాలతోపాటు స్టేడియం అందుబాటులోకి తీసుకుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసి యేషన్ సభ్యులు రాయపు రమేష్‌నాయుడు, డాక్టర్ సందీప్, బట్టా సుబ్రహ్మణ్యం, డాక్టర్ సందీప్, ప్రసాద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి

కోట, మే 31: మండలంలోని చిట్టేడు నందమూరి బసవతారకకాలనీలో శుక్రవారం చట్టాలపై అవగాహన జరిగింది. గూడూరు డీఎస్పీ సూర్య నారాయణ రెడ్డి, వాకాడు సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతల విషయమై గిరిజనులను అవగాహన కల్పించారు. కౌంటింగ్ పూర్తిఅయ్యేంత వరకు ఎలాంటి సభలు, సమావేశాలలో పాల్గొనకూడదన్నారు. రాజకీయ నాయకుల సంబరాలకు దూరంగా ఉండాలన్నారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరిజనులకు అవసరమైన అన్ని వసతులు పోలీసుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు. ఇందు కోసం ఎన్నికల సమయంలో వర్తించే చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ నాగబాబు, పలు మండలాల పోలీసులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని దుగరాజపట్నం, కొండూరుపాళెం, జెమిని కొత్త పాళెం, తూపిలిపాళెం తదితర మత్స్యకార గ్రామాల్లో గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ హరికృష్ణ, ఎస్‌ఐ పవన్‌కుమార్ సహా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తడ: ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నరసింహరావు హెచ్చరించారు. కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎన్నికల సంఘం నిబంధలు విధించిందని ఆ మేరకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఫలితాల తరువాత ఎటువంటి ఊరేగింపులు, బాణసంచా పేలుళ్లు నిర్వహించరాదని ఆదేశాలున్నాయని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుమికూడరాదని తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని... ఉరేసుకున్న భర్త



గణేష్ మృతదేహం

తడ, మే 31: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్థాపంతో యువకుడు ఉరేసుకున్నాడు. చెన్నై నగరం మన్నాడ్‌కు చెందిన గణేష్ (21)కు పూడి గ్రామానికి చెందిన మహిళతో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటినుంచి గణేష్ అత్తగారి ఇంటికి వచ్చి వెళ్తుంటాడు. కొద్దిరోజులుగా పూడిలోని ఓ దుకాణంలో పని చేస్తున్నాడు. మనస్పర్థల కారణంతో వారంరోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన గణేష్ గురువారం రాత్రి సమయంలో తాను పనిచేసే దుకాణంలోనే ఉరి వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం షాపుకు వచ్చిన యజమాని గణేషు ఉరేసుకున్న విషయాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్యాచార కేసులో నిందితుల అరెస్ట్

సూళ్లూరుపేట, మే 31: ప్రియుడిని నిర్బంధించి యువతిని అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం శ్రీహరికోట పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మధుబాబు తెలిపిన వివరాలు... ఈనెల 29న తీర ప్రాంత గ్రామ పొలాల్లోకి ఓ యువతి సహా ఆమె ప్రియుడిని తడకు చెందిన ఏళుమలై, బాలాజి మాయమాటలు చెప్పి తీసుకెళ్లారు.అక్కడికి వెళ్లిన తరువాత ప్రియుడిని నిర్బంధించి ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీహరికోట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

నీటిగుంటలో పడి యువకుడి మృతి

చిల్లకూరు, మే 31: మండలంలోని ఏరూరులో శుక్రవారం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో పడి వ్యక్తి యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(30) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిగుంటలో పడి ఇరుక్కుపోయి మృతి చెందాడు. బహిర్భూమికి వెళ్లిన మనోజ్‌కుమార్ ఎంతసేపటికీ ఇంటికి రావకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా నీటిగుంటలో తేలుతుండడాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జామాయిల్ తోట దగ్ధం



కోట, మే 31 : మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీలో మైక్రో టవర్ కాలనీ వద్ద శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు జామాయిల్ తోటకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆ మంటలు పక్కనే ఉన్న తాటిచెట్లకు పాకడంతో స్థానికులు కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కొన్ని జామాయిల్ చెట్లు, తాటిచెట్లు పూర్తిగా కాలిపోయాయి. హెడ్ కానిస్టేబుల్ సిద్ధిక్, నాగరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



హోమంలో అర్చకులు, భక్తులు

గూడూరు, మే 31: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనేటిమిట్ట కోదండరామాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. మాళవ్యా నగర్‌లోని శ్రీరామరక్ష కుటీరంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సీతారామ కల్యాణం నిర్వహించారు.

వైభవంగా కలశమాల శోభాయాత్ర



స్వర్ణముఖినదిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలోని అగ్రహారపేటలో కొలువై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో కలశమాల శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం రామనామ సంకీర్తనలతో గాంధీమందిరం, పోలేరమ్మ ఆలయం మీదుగా ఆంజనేయస్వామి దేవస్థానానికి చేరుకుంది.

అమిత్‌షాను కలసిన కోట బీజేపీ నేతలు



కోట, మే 31: కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తిరుపతి విమానాశ్రయంలో కోట బీజేపీ నాయకులు ఆయనకు ఆహ్వానం పలికారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు, కోర్ కమిటీ సభ్యులు గిరిధర్‌రెడ్డి పలువురు బీజేపీ నాయకులు గూడూరు నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

గూడూరు అర్బన్, మే 31: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తున్నట్టు ఏవో రమేష్ పేర్కొన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డుతో బయోమెట్రిక్ ద్వారా ఆర్‌బీకేలలో రైతులు పొందవచ్చని తెలిపారు.

నీడలేని పాత ఆర్టీసీ బస్టాండ్



పాత బస్టాండ్ వద్ద రోడ్డుపైనే ఉన్న ప్రయాణికులు

వెంకటగిరి టౌన్, మే 31: ప్రయాణికులకు వసతులు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారు. దీనికి నిదర్శనమే పాత ఆర్టీసీ బస్టాండు. నాలుగు సంవత్సరాలుగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడి నుంచి తిరుపతి, నెల్లూరు, రాపూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు చేరుకోవచ్చు. పాత ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో షాపులుగా మార్చి బాడుగులకు ఇచ్చేయాలని మున్సిపాలిటీ అధికారులు నిర్ణయించారు. కొంతమంది స్వచ్ఛంద సేవా సమితి నిర్వాహకులు అక్కడ మరుగుదొడ్లు నిర్మిస్తే బాగుంటుందని గత పాలక వర్గానికి వినతిపత్రం అందించారు. అప్పటి నుంచి ఆ బస్టాండ్ మరుగుదొడ్డిగా మారిపోయింది. దీంతో ప్రయాణికులు ఎండకు, వానకు రోడ్డుపైనే ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాత బస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పదవీ విరమణ సిబ్బందికి సన్మానం

గూడూరు అర్బన్/ వాకాడు/ కోట, మే 31: గూడూరు ఏరియా ఆసుపత్రిలో హోమియో ఫార్మాసిస్టుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన రాఘవరెడ్డిని శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... 42 సంవత్సరాలుగా హోమియో ఫార్మాసిస్టుగా పేదలకు ఆయన సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు షరీనా, నాన్సీగ్రేస్, కృష్ణారెడ్డి, లహరి, మధుసూదన్‌రావు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు. వాకాడు ఏరియా వెటర్నరీ శాఖలో నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి శుక్రవారం పదవీ విరమణ చేసిన లైవ్‌స్టాక్ అధికారి ఎస్. నిర్మలా కుమారి దంపతులకు వాకాడు ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో వాకాడు, చిట్టమూరు మండలాల వెటర్నరీ డాక్టర్లు, పారామెడికల్ తదితర సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. డాక్టర్లు సీహెచ్ కృష్ణారావు, శ్రీహరి, మంజుల పాల్గొన్నారు. కోట మండల పరిధిలోని చిట్టేడులోని ఆయూష్ ఆసుపత్రిలో శుక్రవారం ఎన్‌ఈఎన్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌రెడ్డి పదవీ విరమణ సన్మానసభ జరిగింది. ప్రసాద్‌రెడ్డిని మెడికల్ ఆఫీసర్ సురేష్ ఆధ్వర్యంలో సన్మానించారు.

దాడిపై ఫిర్యాదు

వైసీపీ నాయకులపై కేసు

నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలో నివాసం ఉంటున్న తమ ఇంటిపై వైసీపీ నాయకుడు కె.అశోక్ కుటుంబసభ్యులు, మరో ముగ్గురు దాడి చేసినట్లు అదే పార్టీకి చెందిన పి.రాజేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం జరిగిన జాతరలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య తలెత్తిన మనస్పర్థలను మనస్సులో పెట్టుకొని అదేరోజు అర్ధరాత్రి అశోక్ తన కుటుంబసభ్యులు, మరో ముగ్గురితో కలిసి తమ ఇంటికి చేరుకుని సీసీ కెమెరాలను, కిటికీ అద్దాలను పగలగొట్టి తలుపుతీయాలంటూ నానారభస సృష్టించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సమాచారం అందుకుని అక్కడికి పోలీసులు చేరుకునేలోగా అశోక్ కుటుంబసభ్యులు పరారయ్యారన్నారు. రాజేష్ ఫిర్యాదు మేరకు అశోక్ కుటుంబసభ్యులు, శ్రీకాంత్, సాయి, వంశీపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన రోబోటిక్స్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

కోట, మే 31: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరిగిన ఇండస్ట్రియల్ రోబోటిక్స్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. తరగతులకు రాష్ట్రం నలుమూలల నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, వెంకటేశ్వర్లు ఇండస్ట్రియల్ రోబోటిక్ ప్రోగ్రామింగ్, సిములేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

చంద్రబాబుతో కురుగొండ్ల భేటీ



వెంకటగిరి, మే 31: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. వెంకటగిరి ఎన్నికల సరళిపై చంద్రబాబుకి కురుగొండ్ల వివరించారు. 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా అప్రమత్తంగా ఉండాలని తమ అధినేత సూచించినట్లు రామకృష్ణ తెలిపారు.

పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం



నాయుడుపేట టౌన్, మే 31: పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం జరిగింది. జాతర మహోత్సవాలు చివరి రోజున శుక్రవారం పారిశ్రామికవేత్త పెసల జయరాజ్‌గోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముందుగా పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. పెసల కిషోర్‌బాబు, రమేష్‌బాబు, భాస్కర్, ఎస్.వెంకటకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మునిరాజ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.